

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 29-12-2025 | సంపుటి - 26 | సంచిక -221 | రూ : 4 | పేజీలు: 8





2లో

## నుమాయిష్-2026..

### తేదీలు, టికెట్ ధర ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం

- జనవరి 1 నుంచి నుమాయిష్-2026
- 45 రోజుల పాటు కొనసాగనున్న ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్
- ప్రవేశ టికెట్ ధర రూ.50గా నిర్ధారణ
- మొత్తం 1,050 స్టాళ్లకు అనుమతులు మంజూరు
- ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి కోమటిరెడ్డి

### అసెంబ్లీ సమావేశాల కోసం

## నగరానికి చేరుకున్న అధినేత

### శ్రేణులలో ఉత్సాహం



2లో

- రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలకు హాజరుకానున్న కేసీఆర్
- పాలమూరు-రంగారెడ్డి పథకంపై పోరాటానికి సిద్ధం కావాలని నేతలకు పిలుపు
- ప్రభుత్వ ఎజెండాను బట్టి వ్యూహం రచించాలని సూచన





2లో

## శబరిమల క్షేత్రానికి మండల పూజ ఆదాయం రూ.332 కోట్లు

- శబరిమలలో ముగిసిన మండల దీక్షా పూజలు
- 30.56 లక్షల మంది భక్తులు అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారన్న ఆలయ బోర్డు చైర్మన్
- భక్తులు సమర్పించిన కానుకల రూపంలోనే రూ.83.17 కోట్లు ఆదాయంగా వచ్చినట్లు వెల్లడి

## ఏపీలో ఐదుగురు ఐఏఎస్‌లకు పదోన్నతి

- ప్రభుత్వ కార్యదర్శులుగా నియామకం
- 2010 బ్యాచ్ అధికారులకు ప్రభుత్వ కార్యదర్శి హోదా
- కార్మిక శాఖ కమిషనర్‌గా గంధం చంద్రుడుకు కొత్త బాధ్యతలు
- జనవరి 1, 2026 నుంచి అమల్లోకి రానున్న ఉత్తర్వులు




2లో



2లో

## అమెరికాలో అస్తవ్యస్తమైన రవాణా..

- వేలల్లో విమానాల రద్దు, చీకటిలో వేలాది ఇండ్లు...
- మంచు తుపాను కారణంగా న్యూయార్క్, న్యూజెర్సీ రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ ప్రకటన
- ఒక్క రోజే 5,500లకు పైగా విమానాలు ఆలస్యం...860 సర్వీసులు రద్దు..

### నరసాపురం లేస్ క్రాఫ్ట్ పై

## ప్రధాని మోడీ ప్రశంసలు..

### కృతజ్ఞతలు తెలిపిన సీఎం చంద్రబాబు



2లో

- మన్ కీ బాత్‌లో నరసాపురం లేస్ కళను ప్రస్తావించిన ప్రధాని మోడీ
- ప్రధాని ప్రశంసలపై సోషల్ మీడియాలో ధన్యవాదాలు తెలిపిన సీఎం చంద్రబాబు
- ఈ కళను కాపాడుతున్న మహిళల నైపుణ్యాన్ని అభినందించిన సీఎం
- నరసాపురం లేస్‌కు జీఐ ట్యాగ్ లభించిందని గుర్తుచేసిన ప్రధాని
- ఈ కళ ద్వారా లక్ష మంది మహిళలు ఉపాధి పొందుతున్నారని వెల్లడి



2లో

## ఐఎన్ఎస్ వాఘ్‌షీర్ సబ్ మెరైన్ లో ద్రౌపది ముర్ము

- సముద్ర గర్భంలో సాహస యాత్ర
- కర్ణాటకలోని కార్వార్ నేవల్ బేస్ నుంచి ఈ యాత్ర
- కలాం తర్వాత జలాంతర్గామిలో పర్యటించిన రెండవ రాష్ట్రపతిగా రికార్డు
- భారత రక్షణ సామర్థ్యానికి ఇదొక నిదర్శనమని వ్యాఖ్య

# ఐఎన్ఎస్ వాఘ్‌షీర్ సబ్ మెరైన్ లో ద్రౌపది ముర్ము. సముద్ర గర్భంలో సాహస యాత్ర

న్యూఢిల్లీ: భారత త్రివిధ దళాల సర్వోన్నత అధిపతి, రాష్ట్రపతి ద్రౌపది మూర్ము ఒక చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం కర్ణాటకలోని కార్వార్ నేవల్ బేస్ నుంచి భారత నావికాదళానికి చెందిన స్వదేశీ జలాంతర్గామి ఐఎన్ఎస్ వాగ్‌షీర్‌లో ఆమె ప్రయాణించారు. సముద్ర గర్భంలోకి వెళ్లి సబ్ మెరైన్ పనితీరును, భారత నావికాదళ సామర్థ్యాన్ని ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ అరుదైన ఘనత సాధించిన రెండో భారత రాష్ట్రపతిగా ద్రౌపది మూర్ము రికార్డు సృష్టించారు. గతంలో 2006లో దివంగత రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జలాంతర్గామిలో ప్రయాణించారు. ఆదివారం ఉదయం కార్వార్ నౌకాదళ స్థావరానికి చేరుకున్న రాష్ట్రపతికి, నౌకాదళ చీఫ్ అడ్మిరల్ దినేష్‌కె. త్రిపాఠి స్వాగతం పలికారు. అనంతరం ఆమె నావికాదళ యూనిఫాం ధరించి సబ్ మెరైన్‌లోకి ప్రవేశించారు. యాత్ర సందర్భంగా అధికారులు జలాంతర్గామి యొక్క సాంకేతిక నైపుణ్యం, నిఘా వ్యవస్థ, పోరాట సామర్థ్యాలను ఆమెకు వివరించారు. సిబ్బందితో మాట్లాడిన రాష్ట్రపతి, వారి అంకితభావం, నిబద్ధతను ప్రశంసించారు. 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తితో దేశీయంగా నిర్మించిన ప్రాజెక్ట్ 75లో భాగంగా రూపొందించిన ఆరవ, చివరి సబ్ మెరైన్ ఐఎన్ఎస్ వాగ్‌షీర్. అత్యాధునిక స్టెల్త్ టెక్నాలజీతో,ప్రపంచంలోనే అత్యంత నిశ్శబ్దంగా పనిచేసే డీజిల్‌ఎలక్ట్రిక్ జలాంతర్గాములలో ఇది ఒకటి. శత్రు నౌకలను, జలాంతర్గాములను నాశనం చేయగల టార్పెడోలు, క్షిపణులతో ఇది సన్నద్ధమై ఉంది. ఈ యాత్ర అనంతరం రాష్ట్రపతి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. "ఐఎన్ఎస్ వాగ్‌షీర్ భారత నావికాదళ వృత్తి నైపుణ్యానికి, పోరాట సంసిద్ధతకు, జాతీయ భద్రత పట్ల వారి నిబద్ధతకు నిలువుటద్దం" అని రాష్ట్రపతి కొనియాడారు. ఇప్పటికే సుఖోయ్‌30 ఎంకెఐ, రఫేల్ యుద్ధ విమానాల్లో ప్రయాణించిన మూర్ము, ఇప్పుడు సబ్ మెరైన్‌లో యాత్ర పూర్తిచేసి సాయుధ దళాల మనోధైర్యాన్ని మరింత పెంచారు. ఈ పర్యటన హిందూ మహాసముద్రంలో భారత వ్యూహాత్మక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది.



## అసెంబ్లీ సమావేశాల కోసం
# నగరానికి చేరుకున్న అధినేత..

హైదరాబాద్:తెలంగాణ అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) హాజరుకానున్నారు. రేపటి (డిసెంబరు 29) నుంచి జరగనున్న ఈ సమావేశాలకు తాను హాజరవుతున్నట్లు పార్టీ నేతలతో కేసీఆర్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఆయన ఆదివారం సాయంత్రం ఎర్రవల్లిలోని తన ఫాంహౌస్ నుంచి హైదరాబాద్‌లోని నంది నగర్ నివాసానికి చేరుకున్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై కేసీఆర్ పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఏ ఎజెండాతో ముందుకు వస్తుందో గమనించి, దానికి అనుగుణంగా దీటుగా స్పందించాలని సూచించారు. ముఖ్యంగా పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై అసెంబ్లీ లోపల, బయట బలమైన పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కాగా, అసెంబ్లీ సమావేశాల కోసం కేసీఆర్ హైదరాబాద్‌కు రావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వంపై కేసీఆర్ మీడియా సమావేశంలో తీవ్ర విమర్శలు చేయగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంతేస్థాయిలో బదులిచ్చారు. ఈ మాటల యుద్ధం తర్వాత జరుగుతున్న తొలి అసెంబ్లీ సమావేశాలు కావడంతో ఇవి అత్యంత ఆసక్తికరంగా మారాయి. అధికార, ప్రతిపక్షాల మధ్య వాడీవేడీ చర్చలు, ఆరోపణలతో సభ దద్దరిల్లనుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# నరసాపురం లేస్ క్రాఫ్ట్ పై ప్రధాని మోడీ ప్రశంసలు

ఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నరసాపురం లేస్ క్రాఫ్ట్ (కుట్లు అల్లికల కళ)పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. ఆదివారం ప్రసారమైన తన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన ఈ కళ యొక్క ప్రాముఖ్యతను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రధాని ప్రశంసలపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేస్తూ, ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందించారు. "నరసాపురం లేస్ కళను ప్రశంసించినందుకు ప్రధాని మోదీ గారికి ధన్యవాదాలు. తరతరాలుగా కుటుంబాలు, సంఘాలు కాపాడుకుంటున్న అనేక సంప్రదాయ కళలకు ఆంధ్రప్రదేశ్ నిలయం. నరసాపురంలో పుట్టిన క్రోచెట్ లేస్ తయారీ అటువంటి అద్భుతమైన కళారూపం" అని పేర్కొన్నారు. ఈ కళను కాపాడటమే కాకుండా, ప్రపంచానికి పరిచయం చేస్తున్న మహిళల నైపుణ్యాన్ని, అంకితభావాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని తెలిపారు. ఈ కళకు, కళాకారులకు ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని హామీ ఇచ్చారు. అంతకుముందు తన ప్రసంగంలో ప్రధాని మోదీ, సంప్రదాయ కళలు సమాజానికి సాధికారత కల్పించడంతో పాటు ఆర్థిక ప్రగతికి ముఖ్యమైన సాధనంగా నిలుస్తాయని అన్నారు. "ఆంధ్రప్రదేశ్‌లోని నరసాపురం లేస్ కళ ఇప్పుడు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతోంది. తరతరాలుగా ఈ కళ మహిళల చేతుల్లోనే భద్రంగా ఉంది" అని కొనియాడారు. ఈ కళను ప్రోత్సహించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నాబార్డ్ కలిసి పనిచేస్తున్నాయని, కళాకారులకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నాయని ప్రధాని వివరించారు. నరసాపురం లేస్‌కు జీఐ ట్యాగ్ కూడా లభించిందని గుర్తుచేశారు. దీని ద్వారా 500కు పైగా ఉత్పత్తులు తయారవుతున్నాయని, 250 గ్రామాల్లో దాదాపు లక్ష మంది మహిళలు ఉపాధి పొందుతున్నారని ప్రధాని తన ప్రసంగంలో పేర్కొన్నారు.

# ఏపీలో ఐదుగురు ఐఏఎస్‌లకు పదోన్నతి..

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో పనిచేస్తున్న ఐదుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు పదోన్నతి కల్పించింది. 2010 బ్యాచ్‌కు చెందిన ఈ అధికారులకు ప్రభుత్వ కార్యదర్శి హోదాకు సమానమైన సూపర్ టైమ్ స్కేల్ (పే మ్యాట్రిక్స్ లెవల్ 14) ఇస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ జీవో జారీ చేశారు. ఈ పదోన్నతులు 2026 జనవరి 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పదోన్నతి పొందిన వారిలో చదలవాడ నాగరాణి, డాక్టర్ నారాయణ భరత్ గుప్తా, ఆమ్రపాలి కాట, జె. నివాస్, గంధం చంద్రుడు ఉన్నారు. పరిపాలనలో భాగంగా చేపట్టే సాధారణ ప్రక్రియలోనే ఈ పదోన్నతులు కల్పించినట్లు ప్రభుత్వం పేర్కొంది. పదోన్నతి పొందినప్పటికీ కొందరు అధికారులు తమ పాత పోస్టుల్లోనే కొనసాగనున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా చదలవాడ నాగరాణి, ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ వీసీ, ఎండీగా ఆమ్రపాలి కాట తమ ప్రస్తుత బాధ్యతల్లోనే కొనసాగుతారు. డాక్టర్ నారాయణ భరత్ గుప్తా పదవిని కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్‌గా పునర్వ్యవస్థీకరించారు. గంధం చంద్రుడుకు కార్మిక శాఖ కమిషనర్‌గా ప్రభుత్వం కొత్త బాధ్యతలు అప్పగించింది. ఇప్పటివరకు ఆ పోస్టులో పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎం.వి. శేషగిరి బాబు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. జె. నివాస్‌కు సూపర్ టైమ్ స్కేల్ పదోన్నతి కల్పించగా, ఆయనకు కేటాయించే పోస్టింగ్‌పై త్వరలో ఉత్తర్వులు వెలువడనున్నాయి. అవసరమైన చోట పోస్టుల అప్‌గ్రేడేషన్, కేడర్ సమానత్వం కోసం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేస్తామని సీఎస్ విజయానంద్ తెలిపారు.

## నుమాయిష్2026...తేదీలు, టికెట్ ధర
# ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్: నగరవాసులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే నాంపల్లి ఎగ్జిబిషన్ (నుమాయిష్) తేదీలు ఖరారయ్యాయి. 85వ అఖిల భారత పారిశ్రామిక వస్తు ప్రదర్శన 2026 వివరాలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు వెల్లడించారు. జనవరి 1న ప్రారంభమయ్యే ఈ ప్రదర్శన, ఫిబ్రవరి 15 వరకు మొత్తం 45 రోజుల పాటు కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ ప్రదర్శనను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కలిసి ప్రారంభిస్తారని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ప్రతిరోజు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10:30 గంటల వరకు, శని, ఆదివారాల్లో రాత్రి 11 గంటల వరకు నుమాయిష్ ప్రజలకు అందుబాటులో ఉంటుందని వివరించారు. ఈసారి ప్రవేశ టికెట్ ధరను రూ.50గా నిర్ణయించినట్లు చెప్పారు. ఐదేళ్ల లోపు పిల్లలకు ప్రవేశం ఉచితమని స్పష్టం చేశారు. మొత్తం 1,050 స్టాళ్లకు అనుమతులు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు తమ ఉత్పత్తులను ప్రదర్శించుకునేందుకు ఇది ఒక గొప్ప అవకాశమని ఆయన అన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు.

## అమెరికాలో అస్తవ్యస్తమైన రవాణా..
# వేలల్లో విమానాల రద్దు, చీకటిలో వేలాది ఇండ్లు

అమెరికా, డిసెంబర్ 28: అమెరికాలోని ఈశాన్య ప్రాంతం, గ్రేట్ లేక్స్ పరిసరాల్లో మంచు తుపాను బీభత్సం సృష్టిస్తోంది. శుక్రవారం సాయంత్రం నుంచి మొదలైన మంచు వర్షం శనివారం నాటికి తీవ్ర రూపం దాల్చింది. సెలవుల సీజన్‌లో ప్రయాణాలు చేస్తున్న వేలాది మంది ప్రజలు ఈ తుపాను ధాటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తీవ్రమైన మంచు, గాలి వాన కారణంగా విమాన సర్వీసులు కుప్పకూలాయి. శనివారం మధ్యాహ్న సమయానికి అమెరికా వ్యాప్తంగా దాదాపు 5,580 విమానాలు ఆలస్యంగా నడవగా, కనీసం 860 విమానాలు పూర్తిగా రద్దయ్యాయి. ముఖ్యంగా న్యూయార్క్ మెట్రోపాలిటన్ పరిధిలోని మూడు ప్రధాన విమానాశ్రయాలపై దీని ప్రభావం తీవ్రంగా పడింది. జాన్ ఎఫ్ కెన్నడీ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాలు సగటున రెండు గంటల ఆలస్యంతో నడుస్తున్నాయి. పరిస్థితి తీవ్రతను గమనించిన న్యూయార్క్, న్యూజెర్సీ గవర్నర్లు ఆయా రాష్ట్రాల్లో 'స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీ' (అత్యవసర స్థితి) ప్రకటించారు. ప్రజలు అనవసర ప్రయాణాలు చేయవద్దని, వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆదివారం రికార్డు స్థాయిలో 2.86 మిలియన్ల మంది విమాన ప్రయాణాలు చేస్తారని అంచనా వేస్తున్న తరుణంలో ఈ తుపాను ప్రయాణికులను కలవరపెడుతోంది. మంచు ప్రభావం రవాణాపైనే కాకుండా విద్యుత్ సరఫరాపై కూడా పడింది. మిచిగాన్ రాష్ట్రంలో భారీగా మంచు కురవడంతో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీనివల్ల శనివారం ఉదయానికే సుమారు 30,000 ఇళ్లు, వ్యాపార సముదాయాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. న్యూయార్క్ నుంచి ఫిలడెల్ఫియా వరకు అనేక ప్రాంతాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది.

## శబరిమల క్షేత్రానికి
# మండల పూజ ఆదాయం రూ.332 కోట్లు

కేరళ: కేరళలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమలలో 41 రోజుల పాటు కొనసాగిన మండల పూజ శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిసింది. ఈ సమయంలో సుమారు 30.56 లక్షల మంది భక్తులు అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు అధ్యక్షుడు కె. జయకుమార్ వెల్లడించారు. మండల పూజ సమయంలో ఆలయానికి మొత్తం రూ.332.77 కోట్ల ఆదాయం లభించిందని ఆయన తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే సుమారు రూ.35.70 కోట్లు పెరగడం విశేషమన్నారు. మొత్తం ఆదాయంలో భక్తులు సమర్పించిన కానుకల రూపంలోనే రూ.83.17 కోట్లు వచ్చాయని, మిగిలిన ఆదాయం ప్రసాదాల విక్రయం, ఇతర వనరుల ద్వారా సమకూరినట్లు వివరించారు.

## "ఆంధ్రా ఆత్మకు ప్రతిబింబం"..
# అరకు అందాలపై మంత్రి లోకేశ్ పోస్ట్, నెటిజన్ల స్పందన

అమరావతి: ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ ఆదివారం సోషల్ మీడియాలో పంచుకున్న ఒక పోస్ట్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రకృతి సౌందర్యం, గిరిజన సంస్కృతి, అచంచలమైన స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ.. అరకు లోయలో సూర్యోదయ వేళ తీసిన గిరిజన మహిళ ఫొటోలను ఆయన 'ఎక్స్' వేదికగా షేర్ చేశారు. "ఆంధ్రా ఆత్మను ఒకే ఫ్రేమ్‌లో బంధించినట్లుంది" అంటూ ఆయన ఈ చిత్రానికి క్యాప్షన్ జోడించారు. ప్రముఖ అవార్డు విన్నింగ్ ఫొటోగ్రాఫర్ రాకేశ్ పులప తీసిన ఈ ఫొటో సిరీస్‌లో.. పొగమంచు కమ్మేసిన పచ్చని కొండల నడుమ సూర్యోదయం వేళ, తలపై బిందెతో ఉన్న ఓ గిరిజన మహిళ నీడరూపం (సిల్హౌట్) అద్భుతంగా కనిపిస్తుంది. తాను ఇటీవల తీసిన ఈ చిత్రాలు... అరకులోని చూడని కోణాన్ని ఆవిష్కరిస్తాయని ఫొటోగ్రాఫర్ రాకేశ్ పేర్కొన్నారు. లోకేశ్ పోస్ట్ చేసిన కొద్ది గంటల్లోనే ఈ ఫొటోకు వేల సంఖ్యలో లైకులు, స్పందనలు వెల్లువెత్తాయి. తూర్పు కనుమల్లోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న అరకు లోయ జీవవైవిధ్యానికి, గిరిజన సంస్కృతికి ప్రసిద్ధి. కొండదొర, వాల్మీకి వంటి తెగల ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారు. బొర్రా గుహలు, కాఫీ తోటలు ఇక్కడి



ప్రధాన పర్యాటక ఆకర్షణలు. మంత్రి లోకేశ్ పోస్ట్‌పై నెటిజన్లు విస్తృతంగా స్పందించారు. "నిజంగా చాలా అందమైన చిత్రాలు" అంటూ కొందరు అభినందించగా, మరికొందరు పెరుగుతున్న పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వానికి సూచనలు చేశారు. "అరకు చూడదగ్గ ప్రదేశం, కానీ రద్దీ ఎక్కువగా ఉంటోంది. అరకుతో పాటు విశాఖలో కూడా ప్రభుత్వం సౌకర్యాలు మెరుగుపరచాలి" అని ఒక యూజర్ కామెంట్ చేశారు. అరకులో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఇప్పటికే అనేక చర్యలు చేపడుతోంది. ఈ ఏడాది ప్రారంభంలో 'అరకు చలి ఉత్సవ్' వంటి కార్యక్రమాలు నిర్వహించి గిరిజన కళలు, సంస్కృతిని ప్రోత్సహించింది. నూతన పర్యాటక విధానంలో భాగంగా అరకును ఎకోటూరిజం హబ్‌గా తీర్చిదిద్దేందుకు రోడ్ల విస్తరణ, హోమ్‌స్టేల ఏర్పాటు వంటి పథకాలను అమలు చేస్తోంది. అయితే, పర్యాటకాభివృద్ధికి, పర్యావరణ పరిరక్షణకు మధ్య సమతుల్యత పాటించడం అత్యంత కీలకమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## సుపరిపాలనకు రామరాజ్యమే
# బెంచ్ మార్క్: సీఎం చంద్రబాబు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం అయోధ్యలో పర్యటించారు. శ్రీరామ జన్మభూమి క్షేత్రాన్ని సందర్శించి, బాలరాముడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుపరిపాలనకు రామరాజ్యమే బెంచ్‌మార్క్ అని అన్నారు. మంచి పరిపాలనను ఎప్పుడూ రామరాజ్యంతోనే పోలుస్తామని పేర్కొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన చంద్రబాబు, అయోధ్యలో నిర్మించిన రామమందిరం దేశ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. ఎన్నో ఏళ్ల వివాదాల అనంతరం ఆలయం నిర్మితం కావడంతో దేశ ప్రజల కల సాకారమైందన్నారు. ఆలయ నిర్మాణంతో పాటు, ఉత్తరప్రదేశ్‌లో మంచి పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను ఆయన అభినందించారు. దేశంలోని ఇతర దేవాలయాలకు అయోధ్య రామాలయం ఒక మార్గదర్శిగా నిలవాలని



ఆకాంక్షించారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడంలో ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాలు కూడా కీలక పాత్ర పోషించాలన్నారు. సాంకేతికంగా దూసుకెళుతున్న భారత్‌ను ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు. తన పర్యటన అనంతరం చంద్రబాబు 'ఎక్స్' వేదికగా స్పందించారు. "శ్రీరాముడు పాటించిన విలువలు కాలాతీతమైనవి, సుపరిపాలనకు నిరంతరం మార్గదర్శకంగా నిలుస్తాయి. అయోధ్యలో శ్రీరామ దర్శనం నాకు నూతన శక్తిని ఇచ్చింది" అని తన పోస్టులో పేర్కొన్నారు.

# ఘనమైన చరిత్ర కాంగ్రెస్ పార్టీది

* కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి
* ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ఎంతో మంది మేధావులను, విద్యావంతులను దేశానికి ప్రధానులుగా, రాష్ట్రానికి ముఖ్యమంత్రులుగా అందించిన ఘనమైన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 1885 డిసెంబర్ 28న స్థాపితమైన కాంగ్రెస్ పార్టీ ఆసియా, ఆఫ్రికాల్లో విస్తరించిన బ్రిటిషు సామ్రాజ్యంలో ఉద్భవించిన తొలి ఆధునిక జాతీయవాద పార్టీ అని అన్నారు. 1920ల నుండి మహాత్మా గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ భారత స్వాతంత్ర్యోద్యమంలో అగ్రభాగాన నిలిచి పోరాడిదన్నారు. భారతదేశ ఖ్యాతిని నలుమూలల వ్యాపింపజేసి దేశం అభివృద్ధి పథంలో నడవడానికి కాంగ్రెస్ పార్టీ ఎంతో దోహదం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ దేశ ఆర్థిక రంగం, రైతు సంస్కరణ చట్టాలు, విద్యా హక్కు చట్టాలు, ఉపాధి హామీ చట్టాలు, ఎన్నో ఉపాధి సంస్కరణలు ఈ దేశానికి అందించడం జరిగిందన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని అయేంత వరకు ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలున్నారు.

## ఉపాధి హామీ పథకం పేరు మార్చడమంటే దేశ ఐకమత్యాన్ని దెబ్బతీయడమే

* కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి
* మహాత్మ గాంధీ చిత్ర పటంతో కళ్లకు నల్లగంతలతో నిరసన



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్చడమంటే దేశ ఐకమత్యాన్ని దెబ్బతీయడమేనని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి అన్నారు. మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్చడాన్ని నిరసిస్తూ ముస్తాబాద్ మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మహాత్మ గాంధీ చిత్ర పటంతో కళ్లకు నల్లగంతలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిజెపి ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు నుంచి మహాత్మ గాంధీ పేరు తొలగించి అవమానించడం సరైంది కాదన్నారు. తిరిగి అదే పేరును కొనసాగించేంత వరకు పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలున్నారు.

## విద్యార్థులు అంకితభావం , పట్టుదలతో పని చేసి మంచి ఫలితాలను సాధించాలి

* (దక్షిణాసియా) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి. రామకృష్ణ



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : విద్యార్థులు అంకితభావం , పట్టుదలతో పని చేసి మంచి ఫలితాలను సాధించాలని (దక్షిణాసియా) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి. రామకృష్ణ అన్నారు. హైదరాబాద్ లోని ఐసిబిఎంస్కూల్ ఆఫ్ బిజినెస్ ఎక్సలెన్స్ (ఐసీబీఎం -ఎస్ బీఈ) తన 202325 పిజిడిఎం బ్యాచ్ విద్యార్థుల కోసం ఆదివారం హైదరాబాద్‌లోని ఐసిబిఎంఎస్‌బిఇ ఆడిటోరియంలో 18వ స్నాతకోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి (దక్షిణాసియా) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి. రామకృష్ణ తో పాటు అడోబ్ డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ స్ట్రాటజిక్ అకౌంట్ డైరెక్టర్ దీపక్ గార్గ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు వృత్తిపరమైన ప్రపంచంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో వారు పట్టుదలతో అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. గౌరవ అతిథిగా హాజరయ్యారు. అనంతరం వారు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న 176 మంది విద్యార్థులకు పట్టాల ప్రదానం చేశారు.ఐసీబీఎం ఎస్బీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ షంషుద్దీన్ జరార్, 202325 పీజీడిఎం బ్యాచ్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రతి విద్యార్థి నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ నారాయణరెడ్డి, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ రీతు జరార్ ప్రొఫెసర్ జితేందర్ గోవిందాని , విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు .

## పిజిఆర్ సేవలు చిరస్మరణీయం

* శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దివంగత నేత పి జనార్దన్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆదివారం పిజిఆర్ వర్ధంతిని పురస్కరించుకొని కూకట్ పల్లి డివిజన్ అజ్బెస్టాస్ కాలనీ పాపిరెడ్డి నగర్ రోడ్ నెం.13,14 బ్లాక్.. సి లోని పీజేఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే గాంధీ హాజరై విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడుతూ పిజిఆర్ ఆశయాలను కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కుల వెంకటేశ్వరరావు, నాయినేని చంద్రకాంత్ రావు, పాపి రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి , అస్బెస్టార్స్ కాలనీ అధ్యక్షుడు నరేష్ ముదిరాజ్ , ప్రగతి నగర్ అధ్యక్షుడు విష్ణు, హనుమాన్ నగర్ అధ్యక్షుడు మనోళ్ల విట్టల్, సీనియర్ నాయకులు అంబాల మహేష్ గౌడ్, చిరుమర్తి రాజు మాదిగ తో పాటుగా పీజేఆర్ అభిమానులు, నేతలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### ఉద్యోగుల పట్ల పాలకులు
# తమ వైఖరులను సరి చేసుకోవాలి

* టి పి టి ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బుటారి. రాజు




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఉద్యోగులు, ఉపాధ్యాయులు , పెన్షనర్ల పట్ల గత పాలకులు వ్యవహరించిన తీరుగానే ప్రస్తుత పాలకుల వ్యవహార శైలి ఉన్నదని పాలకులు తమ వైఖరిని సరి చేసుకోవాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షులు బుటారి రాజు ప్రభుత్వానికి హితవు పలికారు. ఏహెచ్ఎస్ పాల్వంచలో జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్ అధ్యక్షతన ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో బుటారి రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.... స్వయాన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు పెండింగ్ లో ఉన్న బకాయిలను ప్రతినెల 700 కోట్లు చెల్లిస్తామని హామీ ఇచ్చి 9 నెలలు గడుస్తున్న కేవలం మూడు మాటలు మాత్రమే అరకొర చెల్లింపులు చేయడం సరికాదని, మొత్తం బకాయిల చెల్లింపులకు ఇంకెంతకాలం కాలయాపన చేస్తారని, పొదుపు చేసుకున్న సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం వాడుకోవడమే కాక చెల్లించకుండా జాప్యం చేయడం సరికాదని, ఇచ్చిన హామీ ప్రకారం మొత్తం పెండింగ్ బకాయిలను ఇప్పటికైనా వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్యారంగం పట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నదని, భాషా పండితుల, పీఈటి పోస్టులను పాఠశాల సహాయకులుగా అప్గ్రేడ్ చేయకుండా జాప్యం చేస్తున్నదని, సమ్మె సందర్భముగా గిరిజన సంక్షేమ సిఆర్టి లకు మినిమం టైం స్కేల్ ఇస్తామని హామీ ఇచ్చి సంవత్సరం గడిచిన అమలుకు నోచుకోలేదని, కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలకు 13 సంవత్సరాల నుండి పోస్టులు మంజూరు చేయబడలేదని, ఈ విషయాలను అధికారుల, మంత్రుల దృష్టికి ఎన్ని మార్లు తీసుకెళ్లినప్పటికీ పరిష్కరించబడటం లేదని, ఇది ప్రభుత్వ సాచివేత ధోరణకు నిదర్శనం అని అన్నారు. సమస్యల పరిష్కారానికి పోరాటాల శరణ్యమని ఉపాధ్యాయులు అందరూ పోరాటాలకు సిద్ధంగా ఉండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యవర్గ సమావేశంలో జిల్లా నూతన ప్రధాన కార్యదర్శిగా జోగ రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులుగా పాయం కృష్ణయ్యలు ఏకగ్రీవంగా ఎన్నిక కాబడ్డారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్, జిల్లా కమిటీ సభ్యులు జోగ రాంబాబు, డి.ఉమాదేవి, ఎస్. కృష్ణ బాబు, జి.గంగరాజు రాష్ట్ర కౌన్సిలర్లు బి.ప్రసాదరావు కె.మాధవరెడ్డి రాష్ట్ర మాజీ కార్యదర్శి, రాష్ట్ర అకాడమిక్ సెల్ సభ్యులు మునిగడప రామాచారి వివిధ మండలాల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ మైనార్టీ నాయకుల సమీక్ష సమావేశం

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య మైనార్టీ నాయకుల సమీక్ష సమావేశం ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెం కాంగ్రెస్ మైనార్టీ టౌన్ అధ్యక్షులు ఎండీ ఖాజా బక్ష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షులు మొహమ్మద్ ఖాన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఇటీవల నూతనంగా ఎన్నికైన మైనార్టీ ఉపసర్పంచులు, వార్డ్ మెంబర్లను ఘనంగా సన్మానించారు. అనంతరం మొహమ్మద్ ఖాన్ మాట్లాడుతూ రాబోయే జడ్పిటిసి, ఎంపిటిసి, వార్డ్ కౌన్సిలర్ ఎన్నికల్లో అవకాశం ఉన్నచోట అర్హులైన నాయకులకు పోటీ చేసే అవకాశం కల్పిస్తామని తెలిపారు. పార్టీ క్రమశిక్షణకు లోబడి, కాంగ్రెస్ పార్టీ లైన్ దాటకుండా అందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ కరీం పాషా, కొత్తగూడెం నియోజకవర్గం అసెంబ్లీ ప్రెసిడెంట్ ఎండీ గౌస్, అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ ఎస్.కే. జానీ పాషా, ఉపసర్పంచ్ గౌరె బాబా, వార్డ్ మెంబర్ ఎండీ ఆఫ్రిన్, ఎండీ కమర్, ఎండీ ఆరిఫ్, ఎండీ ఖలీల్, ఖైరుల్ ఖాన్, ఖాదర్ బాబా, నిసార్, ఎండీ అబ్బాస్, ఎండీ రహీం, ఎండీ తాసిద్దీన్, అల్లాబక్ష్, ఎండీ అంజు, ఎస్.కే. జానీ, ఎస్.డి. అన్వర్, ఎండీ బాసిద్దీన్, తస్లీమ్ పాల్గొన్నారు. అలాగే పాల్వంచ మండలం అధ్యక్షురాలు హసీనా షాహిన్, షాజహాన్ బేగం, సవానా, కౌసర్, ఫర్జానా తదితర మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేశారు.

### మార్చి 16 నుంచి కొత్తగూడెంలో
# తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు

* తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ రైతు సంఘం మూడవ రాష్ట్ర మహాసభలు మార్చి 16, 17, 18 తేదీల్లో కొత్తగూడెం పట్టణంలో నిర్వహించనున్నట్లు అఖిల భారత కిసాన్ సభ జాతీయ కమిటీ సభ్యులు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి ప్రకటించారు. ఆదివారం రామా టాకీస్ రోడ్డు డాక్టర్ భూపతి రావు గ్రౌండ్లో జరిగిన మహాసభల ఆహ్వాన సంఘ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అమలు చేస్తూ దేశాన్ని అప్పుల పాలుచేసిందని, 2020లో తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాలతో వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగించేందుకు ప్రయత్నించిందని విమర్శించారు. రాష్ట్ర కార్యదర్శి సాగర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రైతాంగాన్ని ఐక్యం చేసి ఉద్యమాలు నిర్మిస్తామని చెప్పారు. విద్యుత్ సవరణ చట్టం, ఉపాధి హామీ చట్టం నిర్వీర్యం వల్ల రైతులు, పేదలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పేదలు, కార్మికులు, కర్షకులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. అనంతరం 150 మందితో ఆహ్వాన సంఘ కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా జలసూత్రం శివరాం ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా అన్నవరపు సత్యనారాయణ, కోశాధికారిగా ఎలమంచిలి వంశీకృష్ణ ఎన్నుకున్నారు. సమావేశంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## దశల వారిగా ప్రజల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటా

* మాజీ కార్పొరేటర్ జి.సురేష్ రెడ్డి



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : దశల వారిగా ప్రజల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని మాజీ కార్పొరేటర్ జి.సురేష్ రెడ్డి అన్నారు. ఆదివారం సుభాష్ నగర్ డివిజన్ లో గల జే.కె. నగర్, శ్రీ సాయి వెంకట ఎంక్లేవ్ లలో నెలకొన్న సమస్యలను తెలుసుకొనుటకు కాలనీ వారి ఆధ్వర్యంలో ఆయన పాదయాత్ర నిర్వహించారు. అనంతరం కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ , సిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాదయాత్ర లో భాగంగా సురేష్ రెడ్డి వివిధ సమస్యలను అక్కడి నుండే అధికారులకు ఫోన్ చేసి సమస్యలను తెలియజేశారు. త్వరలోనే దశల వారీగాకార్పొరేటర్ సహకారం తో, ఎమ్మెల్యే సహకారం తో సమస్యలను పరిష్కరిస్తామని సురేష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం లో డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, శివాగౌడ్, జహంగీర్, స్థానిక నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## మన్ కీ బాత్' కార్యక్రమాన్ని వీక్షించిన బీజేపీ నేతలు



కుత్బుల్లాపూర్ ,( ప్రజాస్ఫూర్తి ): ప్రతి నెల చివరి ఆదివారం ప్రసారమయ్యే ప్రధాని నరేంద్ర మోదీ జీ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని ఆదివారం నిజాంపేట సర్కిల్ 276వ వార్డ్ ప్రగతి నగర్ లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు వీక్షించారు. ఉదయం 11.00 గంటలకు ప్రసారమైన 2025వ సంవత్సరపు చివరిది , 129వ ఎపిసోడ్ లో ప్రధాని గత సంవత్సరపు సంఘటనలను, జాతీయ అంతర్జాతీయ అంశాలను స్పృశిస్తూ రాబోయే కాలానికి సంబంధించిన ప్రణాళికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, నాయకులు నరేంద్ర చౌదరి, డాక్టర్ ఎమ్ఆర్ఎస్ రాజు, కెవి సుబ్బారావు, దాసి నాగరాజు, రచ్చ చక్రధర్, అశోక్ మైలారం, సత్య నారాయణ, శిల్ప లత తదితరులు పాల్గొన్నారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



గచ్చిబౌలి , (ప్రజాస్ఫూర్తి) : గచ్చిబౌలి స్టేడియం నందు భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో అత్యధిక సంఖ్యలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన గిన్నిస్ వరల్డ్ రికార్డు నమోదు అయింది. ఈ సందర్భంగా కొంపల్లి శ్రీ గజానన హోమ్స్ కమ్యూనిటీకి చెందిన రిషిత, వెన్యా, ఉమ్మాశ్రీ, లల్లి, సాన్వి , శ్రీనికలను శ్రీ గజానన హోమ్స్ ఛైర్మెన్ నాగిరెడ్డి, వైస్ చైర్మన్ వెంకటరావు, కమిటీ సభ్యులు చిన్నారులకు అభినందనలు తెలిపారు.

# డెస్క్ జర్నలిస్టులందరికీ న్యాయం జరుగుతుంది

* **బస్ పాస్ లతో సహా ఇతర అన్ని సంక్షేమ పథకాలు అందుతాయి**
* **అవాస్తవాలతో కొందరు తప్పుద్రోవ పట్టిస్తున్నారు**
* **టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ**







హైదరాబాద్ , ప్రజాస్ఫూర్తి : జర్నలిస్టుల సంక్షేమం కోసం గత 70 ఏళ్లుగా పాటుపడుతున్న తమ సంఘం డెస్క్ జర్నలిస్టులకు ప్రభుత్వం అన్యాయం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, బస్ పాస్ లతో సహా అన్ని సంక్షేమ పథకాలను వారికి వర్తింపజేసేందుకు తాము ప్రభుత్వంతో చర్చించి పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ భరోసా ఇచ్చారు. ఆదివారం బషీర్ బాగ్ లోని యూనియన్ కార్యాలయంలో జరిగిన (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర ముఖ్యుల సమావేశానంతరం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, రాష్ట్ర నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.గత 10 ఏళ్ల కాలంలో డెస్క్ జర్నలిస్టులకు కొంతమందికి మాత్రమే అక్రిడేషన్ కార్డులు ఇచ్చారని, కానీ ఇప్పుడు తాము డెస్క్ లో పనిచేసే జర్నలిస్టులందరికీ మీడియా కార్డులు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరికి హెల్త్ కార్డుతో పాటు ఇతర సంక్షేమ పథకాలను వర్తింపజేసేలా కృషి చేస్తామన్నారు. అదేవిధంగా నానాటికి జర్నలిజంలో అడుగంటుతున్న విలువలను పెంపొందించేందుకే కొన్ని కట్టుదిట్టమైన నిబంధనలతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 252 జీవోను తీసుకొచ్చిందని ఆయన తెలిపారు. ఉనికి చాటుకోవడానికి కొన్ని సంఘాలు, డెస్క్ జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుందంటూ గగ్గోలు పెట్టడంలో వాస్తవం లేదని, అబద్దాలు, కల్పితాలతో వాళ్ళు చేస్తున్న అపోహలు నమ్మవద్దని ఆయన జర్నలిస్టులను కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత జర్నలిస్టులకు ఇచ్చిన అక్రిడేషన్ కార్డులు ఎంతవరకు పని చేశాయో, దానికి కారణం ఎవరన్నది ప్రతి జర్నలిస్ట్ కు తెలుసునన్నారు. డెస్క్ జర్నలిస్టులను ఇతర జర్నలిస్టులను తాము వేరుగా చూడడం లేదని, వారికి కూడా బస్ పాస్ లతో సహా ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటిని తప్పకుండా వర్తింప చేయిస్తామని అన్నారు. జర్నలిస్టులను తీవ్ర నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న సంఘాలే నేడు జర్నలిస్టులకు మేలు జరుగుతోందంటే ఓర్చుకోలేకనే రోడ్లపైకి వచ్చి ఆందోళనకు దిగుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుంటే పోరాటం చేసే ఏ సంస్థలకైనా, ఏ సంఘాల కైనా టియుడబ్ల్యూజే మద్దతు ఉంటుందన్నారు. ఆ పోరాటం సహేతుకమైనది అయి ఉండాలన్నారు. 252 జీవో తో 13వేల అక్రిడేషన్ కార్డులు తగ్గుతున్నట్లు ఆందోళన చేస్తున్న సంఘానికి ఎవరు చెప్పారని ఆయన ప్రశ్నించారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు అందేలా చేయడమే టియుడబ్ల్యూజే ప్రధాన ధ్యేయం అన్నారు. 1996 సంవత్సరానికి ముందు ఉమ్మడి రాష్ట్రంలో కేవలం 3 వేల అక్రిడేషన్ కార్డులు మాత్రమే ఉండేవని, అప్పటి తమ సంఘం ప్రభుత్వంతో కొట్లాడి గ్రామీణ విలేకరులందరికీ మండలాల వారీగా అక్రిడిటేషన్లు ఇప్పించిన చరిత్ర తమకు ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 3వేల అక్రిడిటేషన్ లను 12వేలకు పెంచిన ఘనత తమ సంఘానిదేనన్నారు. తెలంగాణ రాష్ట్రంలో దేశంలో ఎక్కడా లేని విధంగా 23 వేల అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చామని గొప్పలు చెబుకుంటున్న మిత్రులు , పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా అదే సంఖ్యలో అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చారన్న విషయాన్ని మర్చిపోతున్నారని గుర్తు చేశారు. కార్డుల సంఖ్య ముఖ్యం కాదని, ఆ కార్డులతో ఎన్ని సంక్షేమ పథకాలను అమలు చేసారో, వాటి కోసం ఎన్ని ఉద్యమాలు చేసారో చెబితే బాగుంటుందన్నారు. 252 జీవో తెచ్చి జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని విమర్శించడం సరైంది కాదన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ ఆధ్వర్యంలో ఏడుగురు ప్రముఖులైన పాత్రికేయులతో కమిటీ ఏర్పాటై, ఐదారుసార్లు సమావేశమై మార్గదర్శకాలు రూపొందించిన విషయం గగ్గోలు చేస్తున్న మిత్రులకు తెలియదా? అని విరాహత్ ప్రశ్నించారు. సమాచార శాఖ కమిషనర్ తో పాటు ఆంధ్రజ్యోతి మాజీ సంపాదకులు కే.శ్రీనివాస్, ది హిందూ పత్రిక పొలిటికల్ ఎడిటర్ రవికాంత్ రెడ్డి, వి6 వెలుగు పత్రిక సీఈవో అంకం రవి, సియాసత్ ఎడిటర్ ఆమెర్ అలీ ఖాన్, ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ నాయకుడు కె.ఎన్.హరి తదితరులతో వేసిన కమిటీ రూపొందించిన నిబంధనల మేరకే 252 జీవో వచ్చిందన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనల మేరకు జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల నియమ నిబంధనలు రూపొందించేందుకు సీనియర్ సంపాదకులు రామచంద్రమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీ సూచించిన సిఫార్సులను అప్పటి మీడియా అకాడమీ చైర్మన్ ఎందుకు అమలు చేయలేదని ఆయన ప్రశ్నించారు. రామచంద్ర మూర్తి కమిటీ సిఫార్సులకు భిన్నంగా తీసుకువచ్చిన 239 జీవో తో జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుంటే అప్పటి మీడియా అకాడమీ చైర్మన్, ఆయన సంఘం ఎందుకు నోరెత్తలేదన్నారు. ఆ జీవోతో చిన్న మధ్య తరహా పత్రికలకు, ఉర్దూ పత్రికలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. దాదాపు 4500 అక్రిడిటేషన్ కార్డులు తొలగించబడ్డాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పోరాటాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో, తెలంగాణకు చెందిన యాజమాన్యాలు స్థాపించిన రెండు ప్రధాన పత్రికలకు అక్రిడిటేషన్లను అడ్డుకున్నది ప్రస్తుతం ఆందోళన చేస్తున్న సంఘమేనని విరాహత్ ఆరోపించారు. ఆ విషయంలో ప్రెస్ కౌన్సిల్ ను ఆశ్రయించి, ఆ పత్రికలకు న్యాయం చేసిన ఘనత తమ సంఘానిదే అని ఆయన గుర్తుచేసారు. అయితే గతంలో రాష్ట్రంలో జారీచేసిన దాదాపు 3 వేల అక్రిడిటేషన్ కార్డులు జర్నలిజం వృత్తితో సంబంధం లేని వారి చేతుల్లో ఉన్నట్లు తమ సంఘానికి అందిన ఫిర్యాదుల్లో తేలిందన్నారు. అడ్డదారుల్లో అక్రిడిటేషన్లు పొందిన వారే జర్నలిస్టులుగా చలామణి అవుతూ, ఇసుక వ్యాపారులను, రైస్ మిల్లర్లను, బిల్డర్లను, ఇతర వ్యాపారులను బెదిరిస్తూ పోలీసులకు చిక్కారని, వారిపై కేసులు నమోదు కావడం జర్నలిజం విలువలను మంటగలిపిందన్నారు. జర్నలిస్టులకు అన్యాయం జరుగుతోందంటూ ఆందోళనకు దిగిన ఆ సంఘం రాష్ట్ర కీలక నాయకుని కుటుంబ సభ్యులు నలుగురు మీడియా ఏజెన్సీ పేరుతో అక్రిడేషన్ కార్డులు పొందారని, అదే సంఘానికి చెందిన మరో రాష్ట్ర నాయకుని కుమారుడు యాదాద్రి భువనగిరి జిల్లా లోని ఓ గ్రామ సర్పంచ్ గా వ్యవహరిస్తున్నప్పటికీ, అతనికి జర్నలిస్టు అక్రిడేషన్ కార్డు ఇవ్వడంపై తమ సంఘం ఆందోళన చేసి ఆ కార్డును రద్దు చేయించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో పనిచేసే బాయ్ కి కూడా ఓ పత్రికా బ్యూరో కార్డు అందించడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి పద్ధతుల్లో అక్రిడిటేషన్ కార్డులు దుర్వినియోగం కాకుండా ఉండేందుకు, వాటికీ గౌరవం దక్కించే ఉద్దేశంతోనే కొన్ని కట్టుదిట్టమైన నిబంధనలతో 252 జీవో ను తెచ్చారని ఆయన పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డులతో రిపోర్టర్లకు, డెస్క్ జర్నలిస్టులకు ఇంతకాలం ఏలాంటి ప్రయోజనం చేకూరలేదని, కనీసం ఇప్పుడైనా సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వం పై ఒత్తిడి పెంచి, అక్రిడిటేషన్, మీడియా కార్డులు పొందే వర్కింగ్ జర్నలిస్టులందరికీ ప్రయోజనాలు చేకూర్చేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. 252 జిఓ లో ఉన్న కొన్ని లోటు పాట్లను తాము గుర్తించామని, వాటిని సవరించేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు ఆయన స్పష్టం చేసారు. ఏది ఏమైనా అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు, మీడియా కార్డులు అందించేందుకు తమ సంఘం తీవ్రంగా కృషి చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ మాట్లాడుతూ ఇటీవల తమ సంఘం సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం ముందు రెండు వేల మంది జర్నలిస్టులతో నిర్వహించిన మహా ధర్నాతో ప్రభుత్వం దిగివచ్చి యుద్ధప్రాతిపదికన జీవో జారీ చేసిందన్నారు. అయితే ఆస్తిత్వం కోసం, ఉనికిని చాటుకోవడానికి ఒక సంఘం తమ సంఘ జాతీయ నాయకుడిపై దుష్ప్రచారం చేస్తూ అలజడి సృష్టించడం సహించరానిదన్నారు. ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాల్లో వర్కింగ్ జర్నలిస్టులకు అందిన సంక్షేమ పథకాలన్నీ తమ సంఘం పోరాట ఫలితమేనన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టీయుడబ్ల్యూజే రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్కూరి రాములు, ఉపాధ్యక్షుడు గాడిపల్లి మధు, కార్యదర్శులు కె. శ్రీకాంత్ రెడ్డి, వరకాల యాదగిరి, జి. మధు గౌడ్, కోశాధికారి యం.వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ. రాజేష్, తెలంగాణ చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షుడు యూసుఫ్ బాబు, హెచ్. యూ.జే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి వెయ్యి కోట్లు కేటాయించాలి

* **గల్ఫ్ సంఘాల ప్రతినిధులు**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: 202627 రాష్ట్ర బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రూ.1,000 కోట్లు కేటాయించాలని తెలంగాణ గల్ఫ్ వలస కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. టీపీసీసీ అధ్యక్షుల, ఎమ్మెల్సీ బి.మహేష్ గౌడ్, మంత్రి వాకిటి శ్రీహరి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీలు తక్కల్లపెల్లి రవీందర్ రావు, ఎల్.రమణ, బీజేపీ ఎమ్మెల్యేలు కె.వెంకటరమణ రెడ్డి, ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పైడి రాకేష్ రెడ్డిలను ఆదివారం గల్ఫ్ సంఘాల ప్రతినిధులు కలిసి వినతి పత్రాలు సమర్పించారు. రాష్ట్రానికి చెందిన సుమారు 15 లక్షల మంది కార్మికులు గల్ఫ్ తదితర దేశాల్లో పనిచేస్తూ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, గత రెండు సంవత్సరాలుగా వారి సంక్షేమానికి బడ్జెట్ లో ప్రత్యేక కేటాయింపులు లేవని సంఘాలు ఆవేదన వ్యక్తం చేశాయి. ఎన్నారై శాఖకు ప్రత్యేక మంత్రి నియమించడంతో పాటు, సమగ్ర ఎన్నారై పాలసీతో గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరాయి. విదేశాల్లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యాన్ని నివారించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, సింగపూర్, మలేషియా వంటి దేశాల్లో మృతి చెందిన వారికీ ఇదే ప్రయోజనం వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశాయి. గల్ఫ్ కార్మికుల పిల్లల విద్య, మానసిక, సామాజిక సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయాలని సూచించాయి. అలాగే 'సీఎం ప్రవాసీ ప్రజావాణి'ను బలోపేతం చేయడం, ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయడం, నైపుణ్య శిక్షణ, పునరావాసం, అక్రమ రిక్రూట్మెంట్ పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరాయి. ప్రతి సంవత్సరం 'ప్రవాసి తెలంగాణ దివస్' నిర్వహించాలని, కేంద్ర విదేశాంగ శాఖ మంత్రిగా సేవలందించిన పి. శివ శంకర్ జన్మదినం ఆగస్టు 10న దీనిని అధికారికంగా జరపాలని కోరారు. అలాగే ప్రవాసుల కోసం పీవీ ప్రవాసీ భవన్ ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ స్థాయిలో ప్రవాసి బీమా యోజన విస్తరణ, హైదరాబాద్ లో సౌదీ, కువైట్ కాన్సులేట్ల ఏర్పాటు, వలస కార్మికుల హక్కులను కాపాడేలా కొత్త చట్టంలో మార్పులు చేయాలని కూడా కోరినట్లు సంఘాలు తెలిపాయి. గల్ఫ్ సంఘాల ప్రతినిధుల బృందంలో మంద భీంరెడ్డి, సింగిరెడ్డి నరేష్ రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల, తోట ధర్మేంద్ర, రత్నగిరి వంశీ గౌడ్, వి. వసంత్ రెడ్డి, గజ్జెల అశోక్, చిట్ల మధు, తోట రమేష్, గొల్లపెల్లి సత్యం, బుర్ర తిరుపతి, రేణుక సయోల, మోత్కూరి నవీన్ గౌడ్, కొక్కుల నవీన్ నేత, సయ్యద్ మహబూబ్ లున్నారు.



## గ్రేటర్ పరిధిలో..
## అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు ఇవ్వాలి

* **జీవో 252 ను సవరించాలని విజ్ఞప్తి చేసిన టియుడబ్ల్యూజె - ఐజేయు ప్రతినిధి బృందం**
* **సానుకూలంగా స్పందించిన తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి**

(ప్రజాస్ఫూర్తి, హైదరాబాద్) : అక్రిడిటేషన్ ల కోసం నూతనంగా విడుదలైన జీవో 252 లో మండలానికి ఒక్క అక్రిడిటేషన్ నిబంధనతో మేడ్చల్ జిల్లా జర్నలిస్టులు ఆందోళకు గురికావాల్సిన అవసరం లేదని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. నూతన జీవో లో మండలానికి ఒక్క కార్డు నిబంధన వల్ల గ్రేటర్ పరిధిలో అర్బన్ మండలాలో ప్రధాన పత్రికలలో పనిచేస్తున్న జర్నలిస్టులకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని మీడియా అకాడమీ చైర్మన్ దృష్టి కి ఆదివారం తీసుకెళ్లడం జరిగింది. టి యు డబ్ల్యూ జె ఐజేయు హెచ్ యూ జె, మేడ్చల్, రంగారెడ్డి, జిల్లా ల ప్రతినిధుల బృందం ఈ మేరకు కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది. అర్బన్ మండలాలో ప్రధాన పత్రికలలో కనీసం ముగ్గురు నుంచి నలుగురు విలేకరులు పనిచేస్తున్నారని ఒకటే కార్డు విధానం తో మిగిలిన వారికి నష్టం జరుగుతుందని వివరించారు. గతంలో మాదిరి గ పనిచేస్తూన్న వారికి కార్డులు వచ్చేలా జీవో ను సవరించాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. ఇందుకు మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. నిజమైన జర్నలిస్టులకు ఇబ్బందులు తలేత్తకుండా చూస్తామని తెలిపారు. తన దృష్టి కి వచ్చిన వాటిని పరిశీలించి ఖచ్చితంగా సవరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రాం నారాయణ, రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, హెచ్ యు జె అధ్యక్షులు శంకర్ గౌడ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు, కార్యదర్శి వెంకట్ రాంరెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సలీమ్, కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్–1 జాబితా లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇళ్లు!

* **ఏడాదికి 4.50 లక్షల ఇళ్ల చొప్పన.. వచ్చే రెండేళ్లలో కేటాయించనున్న సర్కారు**

హైదరాబాద్: రాబోయే రెండేళ్లలో ఎల్ 1 జాబితా లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. 202627, 202728 ఆర్థిక సంవత్సరాల్లో ఏడాదికి 4.50 లక్షల ఇళ్ల చొప్పున లబ్ధిదారులకు కేటాయించనుంది. రాష్ట్రంలో నిర్వహించిన ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం మొత్తం 77,68,134 దరఖాస్తులు వచ్చాయి. ఇంటింటి కుటుంబ సర్వే ద్వారా దరఖాస్తుదారులను ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3గా విభజించారు. సొంత స్థలం ఉండి ఇల్లు లేనివారిని ఎల్ 1 జాబితాలో చేర్చారు. ఇందులో 23,20,490 మంది దరఖాస్తుదారులు ఉన్నారు. స్థలాలతో పాటు ఇళ్లు లేనివారిని ఎల్ 2లో చేర్చారు. వీరు 21,49,476 మంది ఉన్నారు. దారిద్ర్యరేఖ (బీపీఎల్)కు ఎగువన ఉన్నవారు, ప్రభుత్వ ఉద్యోగులు, సొంత ఇల్లు ఉన్నవారు, ఆదాయపు పన్ను పరిధిలోని వారిని ఎల్ 3గా గుర్తించారు. వీరు 32,98,168 మంది ఉన్నారు. ప్రజాపాలన దరఖాస్తులు కాకుండా తర్వాత ఇళ్ల కోసం మరో 1,66,664 అర్జీలు కొత్తగా వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం ఏటా నియోజకవర్గానికి 4.50లక్షల ఇందిరమ్మ ఇళ్లను అందిస్తామని ఇప్పటికే ప్రకటించింది. అయితే రాబోయే రెండు ఆర్థిక సంవత్సరాల్లో కేవలం ఎల్ 1 జాబితాదారులే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుగా మారనున్నారు.

## లయన్స్ క్లబ్ సికింద్రాబాద్ నార్త్ సేవలు అభినందనీయం

* **డిస్ట్రిక్ట్ గవర్నర్ సెల్వా సాయిరాంరాజ్**
* **క్లబ్ ఆధ్వర్యంలో ఐదేళ్ళు పూర్తి చేసుకున్న ఉచిత బ్రేక్ ఫాస్ట్ పంపిణీ కార్యక్రమం**



(ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్) : లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని లయన్స్ క్లబ్ 320 బి డిస్ట్రిక్ట్ గవర్నర్ సెల్వా సాయిరాంరాజ్ కొనియాడారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రి సమీపంలో నిత్యం ఉదయం పేదలకు అందిస్తున్న బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమం ఐదు సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదేళ్ళ నుంచి చేస్తున్న సేవలకు గుర్తింపు గాను ప్రత్యేక జ్ఞాపికను డిస్ట్రిక్ట్ గవర్నర్ సెల్వా సాయిరాంరాజ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షుడు బిర్రు ఆంజనేయులుకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక కార్యక్రమాన్ని నిరంతరాయంగా ఐదేళ్ళ పాటు నిర్వహించడం గొప్పవిషయం అన్నారు. ఈ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కూడా నిరంతరాయంగా ఒక కార్యక్రమం కొనసాగడం లేదని గుర్తు చేశారు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ ను అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన మాజీ అధ్యక్షుడు కృష్ణను అభినందించారు. రానున్న కాలంలోను ఇదే విధంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. నిత్యం ఉదయం ఆస్పత్రి రోగులకు సహాయకులుగా ఉంటున్నవారికి బ్రేక్ ఫాస్ట్ ను అందచేసేందుకు అక్కడే ఉండి పర్యవేక్షిస్తున్న లయన్ రవిందర్‌ముదిరాజ్ ను ఆయన బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిల్ చైర్ పర్సన్ లయన్ టి.రాజేంద్రప్రసాద్, జిఈటి కోఆర్డినేటర్ ఎస్ ఎన్ రెడ్డి, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అవంతిరెడ్డి, డిసి అంగర్ రిలీఫ్ రాందాస్, రిజియన్ చైర్‌పర్సన్ సురేష్‌కుమార్, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రబాద్ నార్త్ అధ్యక్షుడు బిర్రు ఆంజేయులు , మాజీ అధ్యక్షులు కృష్ణ, కిషోర్, బి.శ్రీనివాస్‌రెడ్డి, వినోద్ జాదవ్, సిద్దారెడ్డి, సినియర్ లయన్స్ క్లబ్ సభ్యులు చల్లా శ్రీనివాస్‌రెడ్డి, బాషా తదితరులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న బస్ పాస్‌కు డూప్లికేట్ ప్రింట్ ఇవ్వాలి: ఆర్టీసీ, మంత్రికి నెటిజన్ విజ్ఞప్తి

హైదరాబాద్: పోగొట్టుకున్న బస్‌పాస్‌కు కొత్త పాస్ తీసుకోవాల్సిందేననే నిబంధనను పునఃపరిశీలించాలని ఓ నెటిజన్ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ), మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు. మిగిలిన వ్యాలిడిటీ ఉన్న పాస్‌కు డూప్లికేట్ ప్రింట్ ఇచ్చే విధానం తీసుకురావాలని కోరారు. ఆదివారం ఎక్స్ వేదికగా @jp journo9 అనే యూజర్ ఈ విషయంపై స్పందిస్తూ తన అనుభవాన్ని పంచుకున్నారు. ఇటీవల హైదరాబాద్ సిటీ బస్సులకు సంబంధించిన మెట్రో డీలక్స్ బస్ పాస్‌ను తాను పోగొట్టుకున్నట్లు తెలిపారు. ఆ పాస్‌కు ఇంకా 15 రోజుల వ్యాలిడిటీ ఉన్నప్పటికీ, బస్ పాస్ కౌంటర్‌కు వెళ్లి వివరాలు చూపించినా డూప్లికేట్ ప్రింట్ ఇవ్వలేమని, తప్పనిసరిగా కొత్త పాస్ తీసుకోవాల్సిందేనని సిబ్బంది చెప్పినట్లు పేర్కొన్నారు. దీంతో మరో రూ.1850 వెచ్చించి కొత్త పాస్ తీసుకున్నానని వెల్లడించారు. అయితే కొత్త పాస్ తీసుకునే సమయంలో కస్టమర్ మొబైల్ నంబర్‌కు పాస్‌ను లింక్ చేయడం, రిన్యూవల్‌కు నాలుగు రోజుల ముందే అలర్ట్‌లు పంపడం జరుగుతుండటాన్ని ఆయన గుర్తు చేశారు. అంటే బస్ పాస్‌కు సంబంధించిన పూర్తి వివరాలు ఆర్టీసీ వద్ద ఇప్పటికే ఉన్నట్లేనని వ్యాఖ్యానించారు. అలాంటి పరిస్థితిలో బస్ పాస్ పోయినప్పుడు కొంత ఛార్జీ వసూలు చేసి పాత పాస్‌కు డూప్లికేట్ ప్రింట్ ఇచ్చే విధానం అమలు చేస్తే, ఇంకా గడువు ఉన్న పాస్‌దారులకు ఆర్థికంగా ఎంతో ఉపశమనంగా ఉంటుందని సూచించారు. ఈ అంశాన్ని ఆర్టీసీ సంస్థతో పాటు ప్రభుత్వం కూడా సానుకూలంగా ఆలోచించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.





## సోమాజిగూడలో భారీ అగ్నిప్రమాదం



సోమాజిగూడ: నగరంలోని సోమాజిగూడ ప్రాంతంలో ఉన్న అల్‌ఫైన్ హైట్స్ అపార్ట్‌మెంట్‌లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అపార్ట్‌మెంట్‌లో ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతో పరిసర ప్రాంతాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మూడు ఫైరింజన్ల సహాయంతో మంటలను అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నారు. ప్రాథమిక అంచనా ప్రకారం గ్యాస్ లీకేజీ కారణంగానే ఈ అగ్నిప్రమాదం సంభవించి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. ప్రమాద సమయంలో అపార్ట్‌మెంట్‌లో ఉన్న నివాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## సాంకేతికతకు మానవుడే యజమాని కావాలి: మోహన్ భగవత్ ఆకాంక్ష



హైదరాబాద్: హైదరాబాద్ శివార్లలోని కన్హా శాంతి వనంలో జరిగిన ఈ 7వ అంతర్జాతీయ శిబిరానికి 79 దేశాల నుండి ప్రతినిధులతో పాటు RSS చీఫ్ మోహన్ భగవత్ హాజరయ్యారు. ప్రపంచానికి మార్గదర్శకత్వం వహించే 'విశ్వగురువుగా భారతదేశం మళ్ళీ ఎదగడం అనేది మన వ్యక్తిగత ఆశయం మాత్రమే కాదని, అది ప్రస్తుత ప్రపంచ అవసరమని మోహన్ భగవత్ పేర్కొన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి సంఘ్ వంటి అనేక సంస్థలు నిరంతరం కృషి చేస్తున్నాయని, వ్యక్తిత్వ వికాసం ద్వారా సమాజంలో మార్పు తీసుకువచ్చే వ్యక్తులను సంఘ్ సిద్ధం చేస్తోందని ఆయన వివరించారు. సమాజంలో మంచి మార్పును తీసుకురావడానికి, క్రమశిక్షణతో కూడిన హార్డ్ వర్క్ అవసరమని, దీనిని మన చర్యల ద్వారా నిరూపించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పుల గురించి స్పందిస్తూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా వంటి ఆధునిక సాధనాలు మానవాళిపై యజమానిగా మారకూడదని ఈ సందర్భంగా భగవత్ స్పష్టం చేశారు. సాంకేతికత వల్ల ప్రతికూల ఫలితాలు రాకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని, మానవ మేధస్సు ఎప్పుడూ సాంకేతికతను లోక కల్యాణం వైపు, అంటే 'దైవిక ప్రవృత్తి' వైపు నడిపించాలని ఆయన ఆకాంక్షించారు. శాస్త్ర విజ్ఞానాన్ని ధర్మంతో (సృష్టిని నడిపించే సూత్రం) అనుసంధానించినప్పుడే సమతుల్య అభివృద్ధి సాధ్యమవుతుందని, దీనిని మనం జీవించి చూపాలని ఆయన ఉద్ఘాటించారు.


## సభ నడిపేందుకు ప్రభుత్వం జంకుతోంది

**: హరీష్ రావు**



హైదరాబాద్: అసెంబ్లీలో స్నేహపూర్వక వాతావరణాన్ని కాంగ్రెస్ నాశనం చేసిందని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీపై విరుచుకు పడ్డారు. బీఆర్‌ఎస్ హయాంలో సగటున 32 రోజులు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించామని గుర్తు చేసిన హరీష్ రావు.. కాంగ్రెస్ ప్రభుత్వం సగటున కేవలం 20 రోజులు మాత్రమే నడిపిందన్నారు. సభ నడిపేందుకు ప్రభుత్వం జంకుతోందని ఎద్దేవా చేసారు. ఎన్ని రోజులైనా సభ నడుపుతామని బీరాలు పలికి, చివరకు ఒక్క రోజుతోనే ముగిస్తారని మండిపడ్డారు. ఈసారి కనీసం 15 రోజులైనా అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ వ్యవహారాల మంత్రిగా శ్రీధర్‌బాబు పూర్తిగా విఫలమయ్యారని, తాము ఇచ్చిన అజెండాను కాంగ్రెస్ పరిగణనలోకి తీసుకోవడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు పూర్తైనా ఇప్పటివరకు అసెంబ్లీలో ఒక్క హౌస్ కమిటీ కూడా ఏర్పాటు చేయలేదని హరీశ్‌రావు విమర్శించారు.

## ఐ బొమ్మ రవి కేసులో కీలక పరిణామం.. సీన్ లోకి మరో వ్యక్తి ఎంట్రీ




హైదరాబాద్: తెలుగు సినీ ప్రపంచంలో సంచలనంగా మారిన ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవి , కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసు దర్యాప్తులోకి మరో వ్యక్తి వచ్చి చేరారు. ప్రహ్లాద్ అనే వ్యక్తిని తాజాగా పోలీసులు విచారించారు. ప్రహ్లాద్ వెల్లేల పేరిట ఇమ్మడి రవి పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రహ్లాద్ డాక్యుమెంట్లను ఇమ్మడి రవి దొంగలించి ఆయన పేరుతో వీటిని తీసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రహ్లాద్ తన రూమ్ మేట్ అని గతంలో రవి పోలీసులకు చెప్పారు. దీంతో బెంగళూర్ నుంచి ప్రహ్లాద్ ను పిలిపించిన పోలీసులు.. ప్రస్తుతం తమ కస్టడీలో ఉన్న రవి ఎదుటే ప్రహ్లాద్‌ను విచారించారు. అయితే ఇమ్మడి రవి ఎవరో తనకు తెలియదని, తన పేరుతో రవి పాన్ కార్డు, లైసెన్స్ తీసుకున్నట్లు తెలిసి షాక్ కు గురయ్యానని ప్రహ్లాద్ చెప్పినట్లు తెలుస్తోంది. కాగా ప్రహ్లాద్ ప్రస్తుతం బెంగళూరులో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తున్నారు. కాగా రేపటితో ఇమ్మడి రవి పోలీసు కస్టడీ ముగియనుంది. ఈకేసు దర్యాప్తులో కొత్త కొత్త అంశాలు తెరపైకి వస్తుండటంతో దర్యాప్తు ముగిసే నాటికి ఈ కేసు ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో చూడాలి.

## సర్పంచ్‌లకు సీఎంతో ఏం పని లేదు..

# రేవంత్ వ్యాఖ్యలకు అర్వింద్ కౌంటర్



హైదరాబాద్: గ్రామ పంచాయతీలకు నిధులు తీసుకువస్తానన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కౌంటర్ ఇచ్చారు. నిధుల కోసం రేవంత్ రెడ్డి ఎక్కడికీ పోవాల్సిన పని లేదని పంచాయతీ ఖాతాల్లో కేంద్రం నేరుగా నిధులు జమ చేస్తుందన్నారు. సర్పంచ్ లకు సీఎంతో ఏం పని లేదన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యుల ఆత్మీయ సమ్మేళనం ఇవాళ నిజామాబాద్‌లో జరిగింది. ఈకార్యక్రమంలో మాట్లాడిన అర్వింద్.. రేవంత్ రెడ్డి సీఎం అయి రెండేళ్లు పూర్తయిందని ఈ రెండేళ్లు సర్పంచ్ ఎన్నికలు నిర్వహించకపోవడం వల్లే కేంద్ర నుంచి నిధులు రాలేకపోయాయని ఇప్పుడు సర్పంచ్ ఎన్నికలు జరగడంతో కేంద్ర ప్రభుత్వం నేరుగా పంచాయతీ ఖాతాల్లోకి నిధులు జమ చేస్తుందన్నారు. రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లడం, ఆ సంచులు మోయడం ఏమీ వద్దని ఎద్దేవా చేశారు. రెబల్స్ ను కూడా సీఎం రేవంత్ రెడ్డి తన ఖాతాల్లో వేసుకుంటున్నారని 2023 అసెంబ్లీ ఎన్నికల వరకు కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు లేవని దుబ్బాక, హుజూరాబాద్, మునుగోడు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు దక్కలేదన్నారు. మా ఖర్మ కొద్ది బీజేపీ టైమింగ్ సరిగా లేకపోవడం వల్ల తెలంగాణలో మీరు అధికారంలోకి వచ్చారన్నారు. నూతన పాలక వర్గాలు పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. కేసీఆర్ ప్రెస్ మీట్ లో చాదస్తం, వైరాగ్యం తప్ప తనకేమి కనిపించలేదని అర్వింద్ విమర్శించారు. రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను చెప్పమంటే పాత రామాయణం అంతా వినిపించారన్నారు. ఇక్కడున్న చాలా మందితో పాటు తాను కూడా గతంలో కేసీఆర్ అభిమానులమేనని చెప్పారు. నీటి అంశంలో మంచి సబ్జెక్ట్ నేర్చుకున్నప్పటికీ ఆ జ్ఞానమంతా ఆయన కుటుంబానికి రూ40 50 వేల కోట్లు సంపాదించుకోవడానికి ఉపయోగించారు. కేసీఆర్ అంతా పాపాత్ముడు నబూతో న భవిష్యత్ అని అన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు సంగతి కవిత చెప్పుకుంటూ రాష్ట్రమంతా తిరుగుతోందన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా బీఆర్‌ఎస్ నాశనం చేసి ఇవాళ సూక్తులు చెబుతున్నారని ధ్వజమెత్తారు.



## సెల్ఫీ పాయింట్స్.. రేపటి నుంచి జీహెచ్‌ఎంసీ మెగా శానిటేషన్ డ్రైవ్

హైదరాబాద్: నగరాన్ని మరింత శుభ్రంగా, సుస్థిరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ రేపటి నుంచి మెగా శానిటేషన్ డ్రైవ్‌ను ప్రారంభించనుంది. డిసెంబర్ 29 నుంచి జనవరి 31 వరకు కొనసాగనున్న ఈ ప్రత్యేక కార్యక్రమంలో ప్రతిరోజూ 300 వార్డులను కవర్ చేస్తూ విస్తృత స్థాయిలో పరిశుభ్రత పనులు చేపట్టనున్నారు. వార్డు డీలిమిటేషన్ అనంతరం నిర్వహిస్తున్న తొలి పెద్ద స్థాయి శానిటేషన్ డ్రైవ్ కావడం విశేషం. ఈ డ్రైవ్‌లో భాగంగా నగరంలో పేరుకుపోయిన లెగసీ వ్యర్థాలను తొలగించడం, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ ను పూర్తిగా నిర్మూలించడం, నిర్మాణ, కూల్చివేత వ్యర్థాల తొలగింపు వంటి చర్యలు చేపడతారు. అలాగే ప్రధాన రహదారులు, ఫ్లైఓవర్లు, నాలాలు, పార్కులు, ఫుట్‌పాత్‌లను శుభ్రం చేయనున్నారు. పరిశుభ్రత నిబంధనలను ఉల్లంఘించే వారిపై స్పాట్ ఫైన్లు విధించనున్నారు. తొలగించిన జీవీపీలను అందంగా అలంకరించి 'సెల్ఫీ పాయింట్స్'గా అభివృద్ధి చేయాలని జీహెచ్‌ఎంసీ భావిస్తోంది. దీని ద్వారా ప్రజల్లో అవగాహనతో పాటు బాధ్యత భావం పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

## ఆ విషయం నేను చాలా సీరియస్‌గా తీసుకుంటున్నా.. కల్వకుంట్ల కవిత ఫైర్



కల్వకుర్తి: డిండి ఎత్తిపోతల పథకంలో భాగమైన ఎర్రవెల్లి గోకారం నిర్వాసితుల ఆందోళనకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మద్దతు ప్రకటించారు. జనం బాట కార్యక్రమంలో భాగంగా ఇవాళ ఆమె కల్వకుర్తి నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, గోదావరి ప్రాజెక్ట్ మీద మనం చాలా ప్రాజెక్ట్ లను కట్టుకుంటూ పోయామని తెలిపారు. అదే విధంగా కృష్ణా నది ద్వారా 25 లక్షల ఎకరాలకు నీళ్లు రావాల్సి ఉందని, గతంలో ఉమ్మడి రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేసిన సరే చాలా ఎకరాలకు నీళ్లు వచ్చేవి అని తెలిపారు. కానీ కనీసం పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదన్నారు. సంపూర్ణంగా నీళ్లు ఇచ్చే పరిస్థితి లేకుండా ఉందని, మనకు ఇబ్బందులు తగ్గాలంటే ఇంకా నీళ్లు ఎక్కువగా వాడుకోవాలన్నారు. కానీ డిండి ప్రాజెక్టు కింద ప్రపోజ్ చేసిన గోకారం చెరువు అంశాన్ని మాట్లాడుకోవాలని తెలిపారు. గోకరాంలో 9 వందల ఎకరాలు, ఎర్రవెల్లి లో 6 వందల ఎకరాలు ప్రపోజ్ చేశారని అన్నారు. కానీ 15 వందల ఎకరాల భూమి తీసుకుంటే 2 వేల ఎకరాలకు మాత్రమే నీళ్లు వస్తాయని స్పష్టం చేశారు. గోకారం చెరువునే మరింత పటిష్టం చేస్తే ఆ నీళ్లను చెరువు ద్వారానే తీసుకోవచ్చన్నారు. ఇలాంటి అవకాశం ఉన్న సరే బీఆర్‌ఎస్ ప్రభుత్వం గానీ కాంగ్రెస్ గానీ స్పందించలేదని ఫైర్ అయ్యారు. ఇక్కడి ప్రజలు తమ నిరసనగా సర్పంచ్ ఎన్నికలను బాయ్ కాట్ చేశారని తెలిపారు. అయినా సరే ఇక్కడి ఎమ్మెల్యే గానీ ప్రతిపక్షాలు గానీ స్పందించ లేదన్నారు. కనీసం ఎన్నికల కమిషనర్ కూడా స్పందించకపోవటం దారుణమని పేర్కొన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రజలను పట్టించుకోలేదంటే ఎర్రవెల్లి వాసులు మనుషులు కాదా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ విషయాన్ని నేను చాలా సీరియస్‌గా తీసుకుంటున్నా.. సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ వరకు కూడా ఈ అంశాన్ని తీసుకెళ్తా అని హామీ ఇచ్చారు. ఇంతకన్నా అద్భుతంగా ప్రజాస్వామ్యంలో ఎవరైనా నిరసన తెలుపగలరా? అని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ వచ్చి ఇక్కడ పరిస్థితిని పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఒకటి రెండు రోజుల్లో స్పందించకపోతే ఇరిగేషన్ మంత్రి, ముఖ్యమంత్రిని కూడా నిలదీద్దాం.. అని అన్నారు. ఎర్రవెల్లి గ్రామం, ఎర్రవెల్లి తాండ ప్రజలు చేస్తున్న పోరాటానికి మీ సోదరిగా నా మద్దతు ఉంటుంది.. అని కవిత భరోసా ఇచ్చారు.

## రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్‌దే అధికారం: మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ రెండేళ్ల నుంచి ఫాంహౌస్‌లోనే ఉన్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పంచాయతీ ఎన్నికల్లో ఆ పార్టీకి ఎక్కువ సీట్లు రాలేదని చెప్పారు. ఆ పార్టీ హయాంలో పేదలకు ఇళ్లు ఇవ్వలేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సహకారంతోనే భాజపాకు 8 స్థానాలు వచ్చాయని చెప్పారు. ఉపాధిహామీ పథకానికి గాంధీ పేరు తొలగించడం దారుణమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని.. రాహుల్ ప్రధాని అవుతారన్నారు. రాహుల్ ప్రధాని కాగానే ఉపాధి హామీకి మళ్లీ గాంధీజీ పేరు పెడతామని చెప్పారు.

# ఆ నెహ్రూ లేఖలను ఇచ్చేయండి - సోనియాకు షెకావత్ విజ్ఞప్తి

భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు, ఇతర డాక్యుమెంట్లను ప్రధాన మంత్రి మ్యూజియానికి తిరిగివ్వాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్.. కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి విజ్ఞప్తి చేశారు. అవి ఏ ఒక్క వ్యక్తికి చెందినవి కావని, దేశానికి చెందినవని అన్నారు. పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడిన షెకావత్.. కాంగ్రెస్ అనవసర అంశాలను లేవనెత్తుతుందనడానికి ఆరావళి పర్వతాల వివాదం ఓ చక్కటి ఉదాహరణ అంటూ విమర్శలు గుప్పించారు. "మాజీ ప్రధాని నెహ్రూ మరణాంతరం ఆయన పేరుతో స్మారక మ్యూజియం, లైబ్రరీ (ప్రస్తుతం ప్రధానమంత్రి మ్యూజియంగా పేరు మార్చారు)ని ఏర్పాటు చేశారు. ఓ వ్యవస్థ ఏర్పడినప్పటికీ దాని నిర్వహణ సరిగ్గా లేదు. 1970 నుంచి 1990 మధ్యకాలంలో నెహ్రూకు సంబంధించిన అన్ని అనధికార దస్త్రాలను మ్యూజియానికి తీసుకొచ్చారు. ఇందులో పౌరులకు నెహ్రూ రాసిన లేఖలు, అందుకున్న ప్రత్యుత్తరాలున్నాయి. ఇలాంటివి అందరు ప్రధానులకు సంబంధించి 2.5 కోట్ల దస్త్రాలు మ్యూజియంలో భద్రంగా ఉన్నాయి. వీటిలో 4లక్షలు పండిట్ నెహ్రూకు చెందినవే. అయితే, ఆ కుటుంబానికి చెందిన వ్యక్తిగత లేఖలు ఇవ్వాలని చేసిన విజ్ఞప్తి మేరకు 57 కార్టన్లలో 26వేల దస్త్రాలను 2008లో తీసుకెళ్లారు. వాటిని తిరిగి ఇవ్వాలని కోరుతున్నాం. ఆ విషయాన్ని పరిశీలిస్తామని సోనియా గాంధీ చెప్పారు. ఇప్పటికి రెండుసార్లు లేఖలు రాశాం. వాటిని మ్యూజియానికి అప్పగించాలని మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాం" అని షెకావత్ పేర్కొన్నారు.



## 2025లో భారత్ గర్వించదగిన క్షణాలివే

**: ప్రధాని మోదీ**



'మన్‌కీ బాత్' కార్యక్రమం 129వ ఎపిసోడ్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. ఇందులో భాగంగా 2025లో భారతదేశం గర్వించదగిన క్షణాలను ఆయన గుర్తు చేసుకున్నారు. ఆపరేషన్ సిందూర్ తో భారత్ ప్రపంచ దేశాలకు తన బలాన్ని చూపించిందని.. దేశ భద్రతపట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు. దేశంలోని ప్రతిపౌరుడికి ఈ ఆపరేషన్ గర్వకారణంగా మారిందన్నారు. 'వందేమాతరం' 150 ఏళ్లు పూర్తి చేసుకున్నప్పుడు కూడా దేశ ప్రజల్లో ఇదే స్ఫూర్తి కనిపించిందని పేర్కొన్నారు. క్రీడల పరంగా కూడా ఈ ఏడాది చిరస్మరణీయమని మోదీ పేర్కొన్నారు. 12 ఏళ్ల తర్వాత టీమ్‌ఇండియా పురుషుల క్రికెట్ జట్టు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని సొంతం చేసుకుందని.. మహిళల క్రికెట్ జట్టు మొదటిసారి వన్డే ప్రపంచ కప్‌ను గెలుచుకుందన్నారు. మహిళల అంధుల జట్టు టీ20 ప్రపంచ కప్‌ను గెలుచుకొని చరిత్ర సృష్టించిందని గుర్తు చేసుకున్నారు. అంతరిక్ష రంగంలోనూ ఈ ఏడాది భారత్ తన ప్రతిభను చాటుకుందని. ఈ సందర్భంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించిన శుభాన్షు శుక్లాను ప్రశంసించారు. కోట్ల మంది పాల్గొన్న మహా కుంభమేళాను భారత్ దిగ్విజయంగా నిర్వహించి, ప్రపంచ దేశాలను ఆశ్చర్యపరిచిందని మోదీ పేర్కొన్నారు. అయోధ్య రామాలయంలో జరిగిన ధ్వజారోహణ కార్యక్రమం ప్రతి హిందువు గర్వపడేలా చేసిందని అభిప్రాయపడ్డారు. ఈ ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన అనేక పథకాలు, ఇతర విషయాలను గుర్తు చేసుకున్నారు. 2025లో దేశ ప్రజలు ఏ విధంగా ఐక్యతతో, సామరస్యంగా ఉన్నారో అదే విధంగా కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టాలని పిలుపునిచ్చారు. నూతన సంవత్సరంలో దేశాభివృద్ధి కోసం తమ ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

*** మోదీ నోట నరసాపురం లేస్ క్రాఫ్ట్ మాట..**

మన్‌కీబాత్‌లో ప్రధాని మాట్లాడుతూ నరసాపురం లేస్ క్రాఫ్ట్ గురించి ప్రస్తావించారు. ప్రస్తుత మార్కెట్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని నరసాపురం లేస్ క్రాఫ్ట్ చర్చనీయాంశంగా మారిందన్నారు. తరతరాల నుంచి మహిళలే ఈ అరుదైన కళను కాపాడుతూ వస్తున్నారన్నారు. ఏపీ ప్రభుత్వం నాబార్డ్‌తో కలిసి లేస్ క్రాఫ్ట్ కళాకారులకు కొత్త డిజైన్లు, నైపుణ్యాలు నేర్పిస్తోందని.. ప్రస్తుతం దీని మార్కెట్ వేగంగా విస్తరిస్తోందన్నారు. ప్రభుత్వ మద్దతుతో నరసాపురం ప్రజలు ఈ కళకు కొత్త హంగులను చేర్చి ముందుకు తీసుకెళ్తున్నారని ప్రశంసించారు. లక్షలమంది మహిళలు ఉపాధి పొందుతున్న ఈ కళకు జీఐ గుర్తింపు కూడా ఉందన్నారు.

## హాదీ హంతకులు రాలేదు..అవన్నీ నిరాధార ఆరోపణలే
## బంగ్లాదేశ్ ప్రకటనపై బీఎస్ఎఫ్

బంగ్లాదేశ్ విద్యార్థి నేత హాదీ హత్య కేసులో ప్రధాన అనుమానితులుగా ఉన్న ఫైసల్ కరీం మసూద్, ఆలంగీర్ షేక్ భారత్‌కు పారిపోయినట్లు ఢాకా మెట్రోపాలిటన్ పోలీసులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ప్రకటనను బీఎస్ఎఫ్ అధికారులు, మేఘాలయ పోలీసులు ఖండించారు. సరిహద్దు భద్రతా దళం (మేఘాలయ) స్పందిస్తూ.. అంతర్జాతీయ సరిహద్దును దాటి ఎవరూ భారత్‌లోకి వచ్చినట్లు ఆధారాలు లేవని వెల్లడించింది. సరిహద్దుల్లో తమ బలగాలు నిరంతరం అప్రమత్తంగా ఉన్నాయని తెలిపింది. ప్రజలను తప్పుదారి పట్టించేందుకు పొరుగుదేశం ఇటువంటి నిరాధార ఆరోపణలు చేస్తోందని మండిపడింది. బంగ్లాదేశ్ పోలీసులు, అక్కడి మీడియా చేసిన ప్రకటనల్లో నిజం లేదని మేఘాలయ పోలీసులు స్పష్టం చేశారు. ఎవరూ రాష్ట్రంలోకి రాలేదని.. తాము ఎవరినీ అరెస్టు చేయలేదని వెల్లడించారు. ఇవన్నీ భారత్‌పై చేస్తున్న తప్పుడు ఆరోపణలన్నారు. భారత ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించేందుకు



బంగ్లాదేశ్ మీడియా కల్పిత కథనాలను సృష్టిస్తోందన్నారు. కాగా ఢాకా మెట్రోపాలిటన్ పోలీసులు ఆదివారం ఇచ్చిన మీడియా బ్రీఫింగ్‌లో హాదీ హత్య కేసులో ప్రధాన అనుమానితులుగా ఉన్న ఇద్దరు వ్యక్తులు భారత్‌కు పారిపోయినట్లు తెలిపారని ఆ దేశ మీడియా వర్గాలు వెల్లడించాయి. భారత్‌లో వారికి సహకరించిన వారిని మేఘాలయ పోలీసులు అరెస్టు చేసినట్లు తమకు సమాచారం అందిందని తెలిపాయి.

## సర్‌పై విమర్శల వేళ..
## బెంగాల్ ఎన్నికల చీఫ్‌కు వైప్లస్ కేటగిరీ భద్రత

పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మనోజ్ అగర్వాల్ కు కేంద్ర ప్రభుత్వం Yప్లస్ కేటగిరీ (సాయుధ) భద్రత కల్పించింది. రాష్ట్రంలో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ లో భాగంగా 58 లక్షలమంది పేర్లను తొలగించడంతో పలువురు ప్రభుత్వ నేతలు ఎన్నికల కమిషన్‌పై తీవ్ర విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో బీఎల్‌వోలు, ఇతర అధికారులపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో మనోజ్ అగర్వాల్‌కు కూడా ముప్పు పొంచి ఉందని పలు కేంద్ర సంస్థలు ఇచ్చిన సమాచారం మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. Yప్లస్ కేటగిరీ భద్రతలో భాగంగా అగర్వాల్ భద్రత కోసం సీఐఎస్ఎఫ్ విభాగానికి చెందిన



12మంది సిబ్బంది ఆయనకు సెక్యూరిటీగా ఉంటారు.

*** సర్ జాబితాపై కొనసాగుతోన్న విచారణలు..**

పశ్చిమ బెంగాల్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటర్ల జాబితా సవరణ విచారణలు జరుగుతున్నాయని.. ఇందు కోసం రాష్ట్రవ్యాప్తంగా 3,234 కేంద్రాలు ఏర్పాటు చేశామని ఎన్నికల కమిషన్ వెల్లడించింది. అధికారిక లెక్కల ప్రకారం.. ఓటరు జాబితా నుంచి 58.20లక్షల పేర్లను తొలగించినట్లు వెల్లడించింది. వీరిలో దాదాపు 24 లక్షల మంది మరణించారని, మరో 19 లక్షల మంది ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారని, మరో 12లక్షల మంది వివరాలు తెలియలేదని పేర్కొంది. వీటిలో మార్పులు, చేర్పులు, అభ్యంతరాలు తెలపడానికి ఓటర్లకు జనవరి 17 వరకు అవకాశం ఇవ్వడంతో పెద్ద ఎత్తున ప్రజలు ఈసీ కేంద్రాలకు వస్తున్నట్లు తెలిపింది.



## జమ్మూలో 30మందికిపైగా పాక్ ఉగ్రవాదులు..
## అప్రమత్తమైన భద్రతా బలగాలు

జమ్మూ ప్రాంతంలో 30 మందికి పైగా పాకిస్థానీ ఉగ్రవాదులు నక్కినట్లు నిఘా వర్గాలు పేర్కొనడంతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఉగ్ర స్థావరాలు గుర్తించడానికి భద్రతా దళాలు కొండలు, అడవులు, మారుమూల లోయల్లో గాలింపు చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. ఉగ్రవాదులను ట్రాక్ చేయడానికి డ్రోన్లు, థర్మల్ ఇమేజర్లు, గ్రౌండ్ సెన్సార్లను మోహరించినట్లు అధికారులు తెలిపారు. జమ్మూలో ఉష్ణోగ్రతలు తీవ్రంగా పడిపోవడంతో ఉగ్రవాదులపై నిరంతర నిఘా కోసం పర్వత ప్రాంతాల్లో తాత్కాలిక నిఘా స్థావరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు జమ్మూ కశ్మీర్‌లో మంచు కురుస్తోండడంతో చొరబాట్లకు ఇదే అదునుగా భావించిన ఉగ్రమూకలు అంతర్జాతీయ సరిహద్దును దాటుకుని దేశంలోకి చొరబడేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని సరిహద్దు భద్రతా దళం అధికారి వెల్లడించారు. అయితే ఆ ప్రయత్నాలను తమ దళాలు తిప్పికొడుతున్నాయన్నారు. సరిహద్దుల్లో ఉగ్ర కదలికల నేపథ్యంలో కశ్మీర్‌లోని గుల్మార్గ్, సోనామార్గ్ దాల్ లేక్ ప్రాంతాలతో సహా పలు సున్నితమైన ప్రదేశాల్లో భద్రతా దళాలు, స్థానిక పోలీసులు ప్రత్యేక బృందాలను మోహరించాయన్నారు.

## కాంగ్రెస్ మరింత బలోపేతం కావాలి..
## దిగ్విజయ్‌కు శశిథరూర్ మద్దతు

భాజపాఆరెస్సెస్‌లకు ఉన్న సంస్థాగత బలాన్ని కొనియాడుతూ.. కాంగ్రెస్ శక్తిమంతం కావాల్సి ఉందంటూ ఆ పార్టీ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ క్రమంలోనే దిగ్విజయ్ వ్యాఖ్యలకు ఆ పార్టీకి చెందిన మరో నేత శశిథరూర్ మద్దతు పలికారు. కాంగ్రెస్ 140వ వ్యవస్థాపక దినోత్సవం జరుపుకొంటున్న నేపథ్యంలో థరూర్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం. దిగ్విజయ్ వ్యాఖ్యలను విలేకరులు ప్రస్తావించగా.. తమ సంస్థ బలోపేతం కావాలని తాను కూడా కోరుకుంటున్నట్లు థరూర్ తెలిపారు. దీనిపై ఎలాంటి చర్చ అవసరం లేదన్నారు. ఏ పార్టీలో అయినా క్రమశిక్షణ అవసరమన్నారు. 'నేడు పార్టీకి చాలా ముఖ్యమైన రోజు. మనకు 140 ఏళ్ల చరిత్ర ఉంది. దీని నుంచి మనం ఎంతో నేర్చుకోవచ్చు' అని అన్నారు. శనివారం ప్రధాని మోదీకి చెందిన పాత ఫొటోను దిగ్విజయ్ పంచుకున్న సంగతి తెలిసిందే. ఆరెస్సెస్‌లో సామాన్య కార్యకర్త నుంచి ప్రధానిగా మోదీ ఎదిగిన విధానాన్ని ఆయన కొనియాడారు. ఇది భాజపా ఆరెస్సెస్‌కు ఉన్న సంస్థాగతమైన శక్తి అని అభివర్ణించారు. ఈ పోస్టుపై తర్వాత ఆయన మాట్లాడుతూ.. భాజపా ఆరెస్సెస్‌కు తాను వ్యతిరేకినన్నారు. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు.



*** సొంత పార్టీ నుంచే వ్యతిరేకత..**

దిగ్విజయ్ వ్యాఖ్యలకు సొంత పార్టీ నుంచే వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దిగ్విజయ్ అభిప్రాయంతో తాను ఏకీభవించనని ఆ పార్టీ నేత పవన్ ఖేడా అన్నారు. గాడ్సే మద్దతుదారులు.. గాంధీ అభిమానులు కాలేరని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌లో ఐక్యత లోపించిందనే వాదనలను మరో నేత సచిన్ పైలట్ కొట్టిపారేశారు. భారత్‌లో బలమైన ప్రతిపక్షంగా కాంగ్రెస్ ఉందని.. పార్టీలో ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. మరో నాయకురాలు సుప్రియా శ్రీనాథే మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు ఆరెస్సెస్ నుంచి నేర్చుకోవాల్సిన అవసరం లేదన్నారు.

## రోబోటిక్ సాంకేతికతతో.. అరుదైన మూత్రాశయ కణితి తొలగింపు

లఖ్‌నవూ: మూత్రాశయ సమస్యతో బాధపడుతున్న ఓ రోగికి ఉత్తర్‌ప్రదేశ్‌లోని సంజయ్‌గాంధీ పోస్ట్‌గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. బాధితుడి మూత్రాశయంలో ఉన్న కణితిని అత్యాధునిక రోబోటిక్ సాయంతో తొలగించారు. ఈ తరహా సర్జరీ ప్రపంచంలో మొదటిదని సంబంధిత వైద్యులు వెల్లడించారు. ఇటీవల ఆసుపత్రికి వచ్చిన 60ఏళ్ల రోగి.. మూత్ర విసర్జన సమయంలో అకస్మాత్తుగా కళ్లు తిరగడం, తలనొప్పి, గుండె వేగంగా కొట్టుకోవడం, అధిక రక్తపోటు వంటి లక్షణాలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. పరీక్షించిన వైద్యులు మూత్రాశయంలో అరుదైన కణితి ఉన్నట్లు కనుగొన్నారు. అది విడుదల చేసే హార్మోనులే ఈ లక్షణాలకు కారణమని నిర్ధరించారు. సాధారణంగా ఇటువంటి సర్జరీల కోసం లాప్రోస్కోపీ లేదా సంప్రదాయ శస్త్రచికిత్సలు చేస్తారు. కానీ, మూత్రనాళానికి ప్రమాదం ఉండే అవకాశం ఉందని గ్రహించిన వైద్యులు.. రోబోటిక్ టెక్నాలజీని ఉపయోగించారు. యూరాలజీ విభాగం నేతృత్వంలో ప్రత్యేక వైద్య బృందం శస్త్రచికిత్స నిర్వహించి విజయవంతంగా పూర్తిచేసింది. ఈ కేసుతో దేశంలోనే కాకుండా అంతర్జాతీయంగా ఆసుపత్రి ఖ్యాతి మరింత పెరిగిందని, ఈ సమస్యతో బాధపడే రోగులకు భరోసా కలిగిస్తోందని ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి.





# పరిశోధనలతో.. ధైర్యమిచ్చారు!

**కళ్లు తెరిచి ఎవరైనా చూస్తారు... కళ్లు మూసుకుని కూడా చూడగలరా? నయం కావడానికి వారం రోజులు పడుతుందనుకున్న గాయం నాలుగ్గంటల్లో తగ్గిపోతే ఎలా ఉంటుంది? ఇవి నిజం కావాలంటే ఏ మ్యాజిక్కో రావాలి, లేదంటే ఏ కనికట్టు విద్యో తెలియాలి అనుకుంటే పొరపాటు. ఇవన్నీ ఈ ఏడాది శాస్త్రవేత్తలు సాధించిన విజయాలు, అక్షరాలా వాస్తవాలు... అవేంటో తెలుసుకుందాం.**

### చీకటినీ జయించారు...

కళ్లు తెరిచి ఎవరైనా చూడగలరు... కానీ, కళ్లు మూసుకుని చూడగలరా? అదేమంత కష్టం కాదంటూ.... కళ్లు మూసుకుని చీకట్లోనూ చూడగల సూపర్ విజన్ లెన్స్‌ని తయారుచేశారు చైనా శాస్త్రవేత్తలు. రేర్‌ఎర్త్‌మెటల్స్‌తో తయారైన నానోపార్టికల్స్‌ని వాడి శాస్త్రవేత్తలు ఈ సూపర్‌విజన్ కాంటాక్ట్ లెన్స్‌ని తయారుచేశారు. ఈ లెన్స్ పెట్టుకుంటే చిమ్మచీకట్లో కూడా ఏం జరుగుతుందో చూడొచ్చు. దట్టమైన పొగమంచు ఉన్న చోటా, యుద్ధ క్షేత్రాల్లోనూ వాడేందుకు వీటిని తయారుచేశారట.


### సింథటిక్ బ్లడ్...




'మా బంధువుల్లో ఒకాయనకి గుండె ఆపరేషన్ చేస్తున్నారు. అర్జెంట్‌గా ఓ పాజిటివ్ రక్తం కావాలి'... ఇలాంటి మెసేజ్‌లని సోషల్‌మీడియా గ్రూపుల్లో, వాట్సప్ స్టేటసుల్లో చూస్తూనే ఉంటాం. కానీ, ఇకనుంచీ ఇలా ఫలానా గ్రూప్ రక్తం కావాలని కంగారు పడాల్సిన అవసరం ఉండకపోవచ్చు. ఎందుకంటే జపాన్ శాస్త్రవేత్తలు 'వైరస్ ఫ్రీ సింథటిక్ బ్లడ్'ని ఆవిష్కరించారు. ఈ బ్లడ్ గ్రూప్ ఎవరికైనా మ్యాచ్ అవుతుంది. వైరస్‌లు సోకుతాయన్న బాధాలేదు. రెండేళ్ల వరకూ నిల్వ ఉంటుంది. సమయానికి రక్తం అందక చనిపోతున్న లక్షలమందికి ఇది సంజీవనికానుంది.

### నువ్వు గింజంత పేస్‌మేకర్...

పుట్టుకతోనే గుండెజబ్బులు ఉన్న పిల్లలకు



శస్త్రచికిత్సలో భాగంగా ఒక పేస్‌మేకర్‌ని వాళ్ల గుండెలో అమర్చాల్సి ఉంటుంది. చుట్టూ వైర్లూ, కోతలతో పిల్లలు బాగా ఇబ్బందిపడిపోతారు, ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదం కూడా ఉంది. ఆ బాధంతా లేకుండా నువ్వుగింజ పరిమాణంలో ఉండే పేస్‌మేకర్‌ని అమెరికా శాస్త్రవేత్తలు తయారుచేశారు. ఇంజెక్షన్‌తో దీన్ని గుండె దగ్గరకు చేరుస్తారు, శరీరం చుట్టూ వైర్లూ అవీ పెట్టకుండానే దానంతట అదే పనిచేస్తుంది.

### నాలుగ్గంటల్లో నయం

శరీరానికి గాయం అయితే నయం కావడానికి ఎంత సమయం పడుతుంది? ఎంతలేదన్నా... ఒక్క రోజన్నా పడుతుంది కదా! కానీ నాలుగ్గంటల్లోనే నయం చేసే సూపర్‌స్కిన్‌ని తయారు చేశారు ఫిన్‌ల్యాండ్ శాస్త్రవేత్తలు. సన్నని నానోషీట్లూ, హైడ్రోజెల్ మెటీరియల్‌తో తయారుచేసిన ఈ కృత్రిమ చర్మం ఒక్క మిల్లీమీటర్ మందం మాత్రమే ఉంటుంది. దీన్ని గాయాలపైన ఉంచినప్పుడు చర్మంలో పూర్తిగా కలిసిపోయి, దీనిలోని ఔషధాలని శరీరంలోకి పంపి, కేవలం నాలుగ్గంటల్లోనే ఆ గాయాన్ని మానేలా చేస్తుందట.



### బోన్ 02

పడిపోయో, మరో కారణంతోనో ఎముక విరిగిపోతే ఇక ఆ తర్వాత జరిగే శస్త్రచికిత్స ఎంత బాధాకరంగా ఉంటుందో చెప్పాల్సిన పని లేదు. ప్లేట్లు వేయడం, స్క్రూలు బిగించడం... ఈ క్రమంలో ఇన్‌ఫెక్షన్లు కూడా రావొచ్చు. ఇంత తతంగం లేకుండా కేవలం మూడంటే మూడు నిమిషాల్లో విరిగిన ఎముకని అతికించేస్తే ఎలా ఉంటుంది? అవును, చైనా శాస్త్రవేత్తలు 'బోన్ 02' అనే ప్రత్యేకమైన జిగురుని కనిపెట్టారు. ఎముక విరిగిన చోట దీన్ని ఇంజెక్షన్ ద్వారా ఎక్కించి నిమిషాల్లో అతికించేయొచ్చు. సముద్రంలోని బండరాళ్లకు బలంగా అతుక్కునే ఆల్చిప్పల స్ఫూర్తితో ఈ జిగురుని తయారుచేశారు.



### డౌన్‌సిండ్రోమ్ రాకుండా...

డౌన్‌సిండ్రోమ్ ఉన్న పిల్లల్లో శారీరకంగా, మానసికంగా ఎదుగుదలలోపం ఉంటుంది. ట్రైసోమీ 21 అనే అదనపు క్రోమోజోమే ఇందుకు కారణం. ప్రపంచవ్యాప్తంగా కొన్ని కోట్లమంది పిల్లలు ఈ సమస్యతో బాధపడుతున్నారు. జపాన్ శాస్త్రవేత్తలు క్రిస్పర్‌కాస్9 టెక్నాలజీ వాడి డౌన్‌సిండ్రోమ్ వ్యాధి ఉన్నవారి కణాల నుంచి వారికి ఇబ్బంది కలిగించే అదనపు క్రోమోజోమ్‌ని తొలగించారు. దాంతో కణాలు మందకొడిగా కాకుండా సాధారణంగా అందరిలానే పనిచేయడం గమనించారు. ఈ విజయం భవిష్యత్తులో డౌన్‌సిండ్రోమ్‌ని తల్లిగర్భంలో ఉండగానే అడ్డుకోవడానికి పనికొస్తుందని శాస్త్రవేత్తలు అంటున్నారు.


### ఎనామిల్ పొర తిరిగి వచ్చేలా


మన దంతాలపైన ఎనామిల్ అనే రక్షణపొర ఉంటుంది... ఇది ఒక్కసారి పోయిందంటే తిరిగి రాదు. దాంతో దంతాలు పాడవడం, పుచ్చిపోవడం జరుగుతుంది. ఆపైన కృత్రిమ దంతాలని అమర్చుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. అలాకాకుండా మన దంతాలు సహజంగానే తిరిగి ఎనామిల్ పొరను ఏర్పరుచుకునేలా ప్రొటీన్ పేస్ట్‌ని తయారుచేశారు సింగపూర్ శాస్త్రవేత్తలు. ఈ పేస్ట్‌తో బ్రష్ చేసుకుంటే దీనిలోని కెరాటిన్ ప్రొటీన్ దంతాలపైన ఎనామిల్ పొరను సహజంగా ఏర్పరుస్తుంది. ఫలితంగా దంతాలు పాడవకుండా ఉంటాయి. ఈ పేస్ట్‌ని మన జుట్టులో ఉండే ప్రొటీన్‌తో తయారుచేశారట.



# డిసెంబరాలు.. ప్రకృతి అందాలై!

**కొన్ని పూలమొక్కల్ని చూసినప్పుడు వీటినెందుకు పెంచాలి అనిపించడం సహజం. వాసన ఉండవు. అందంగానూ కనిపించవు. ఆ కోవకే చెందుతాయి గంటాకారంలోని డిసెంబర్ పూలు.**











మూడు నాలుగు దశాబ్దాల క్రితంనాటి అమ్మాయిలకు ఇవి సుపరిచితమే. కంచెల్లోనూ రోడ్లపక్కనా ఎక్కడంటే అక్కడ పెరిగే డిసెంబరాల్నీ, పసుపు పచ్చని ముళ్లగోరింటల్నీ కోసి మాలలు కట్టి ఇష్టంగా పెట్టుకునేవారు. ఏ వాసనా లేకున్నా ఆ రంగులు ఆకర్షణీయంగా కనిపించటం, పైగా తేలికగా ఉండటంతో ఎంత పెద్ద మాలనైనా జడలో ఇట్టే తురిమేసేవారు. ముఖ్యంగా డిసెంబర్, జనవరి నెలల్లో ఇవి ఎక్కువగా పూస్తాయి. అందుకే డిసెంబర్ పూలుగా ఇవి వాడుకలోకి వచ్చి ఉండొచ్చు. వీటిల్లో నీలం, ఊదా, తెలుపు, గులాబీ, ఎరుపు... ఇలా రంగులూ రకాలూ చాలానే ఉన్నాయి. అలాంటి రకాల్లో ఒకటి ముళ్లగోరింట. దీన్నే వజ్రదంతి అనీ పిలుస్తారు. అయితే ఇంతకీ వీటిని ఎందుకు పెంచాలన్నదేగా సందేహం. సృష్టిలోని ప్రతి మొక్కకీ ఓ ప్రయోజనం ఉంటుందని తెలిసిందేగా. అలాగే డిసెంబరాలకీ ఓ ప్రత్యేకత ఉంది. ఈ కాలంలో చెట్టునిండా విరబూసిన పూలల్లోని తేనె, ఆ పూల రంగులూ పిట్టల్నీ సీతాకోకచిలుకల్నీ ఆకర్షిస్తాయి. అంటే, పరాగ సంపర్కానికి తోడ్పడుతూ జీవవైవిధ్యానికి దోహదం చేస్తాయి. పైగా దటమైన పొదల్లా పెరిగే ఈ మొక్కల కొమ్మల మధ్యలో బుల్లి పిట్టలూ కీటకాలూ గూళ్లు కట్టుకుంటాయి. అలాగే ఈ మొక్కల ఆకుల్నీ వేర్లనీ జ్వరం, శ్వాస సమస్యల నివారణకు సంప్రదాయ చికిత్సల్లో వాడుతుంటారు. అందుకే ఎలాంటి వాసనా లేకున్నా అందమైన ఆకారంలో మురిపించకున్నా ఆ పూల రంగులు ప్రకృతి అందాలై విరబూస్తుంటాయి. మరి మన ఇంటితోటలో వీటికీ చోటిద్దామా?!







# సినిమా



## వారికి ఆదర్శంగా ఉండాలని..
## రూ.40 కోట్ల ఆఫర్ తిరస్కరించిన నటుడు

కొందరు నటులు ఒక్క సినిమాతో ఎంత సంపాదిస్తారో.. వాణిజ్య ప్రకటనతోనూ అదే స్థాయిలో పారితోషికం అందుకుంటారు. ఈ విషయంలో కొంతమంది జాగ్రత్తలు తీసుకుంటారు. హానికారక ప్రొడక్ట్‌లను ప్రచారం చేసే అవకాశం వస్తే నిర్మొహమాటంగా తిరస్కరిస్తుంటారు. తానూ ఇదే పని చేశానన్నారు బాలీవుడ్ ప్రముఖ నటుడు సునీల్‌శెట్టి. పొగాకు ఉత్పత్తులకు సంబంధించి తన వద్దకు వచ్చిన ఓ ప్రకటనను రిజెక్ట్ చేశానని ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఆ యాడ్ కోసం రూ.40 కోట్లు ఆఫర్ చేశారని చెప్పారు. తన పిల్లలు అహాన్, అతియాకు ఆదర్శంగా ఉండాలన్న ఉద్దేశంతోనే ఆ యాడ్‌ను వద్దన్నానని పేర్కొన్నారు. ఒకవేళ అలాంటి వాటిలో నటిస్తే.. తన పిల్లలకు చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. నటనకు కొన్నాళ్లు విరామం ఇవ్వడంపై స్పందిస్తూ.. ''2014లో నాన్న అనారోగ్యానికి గురయ్యారు. అప్పటి నుంచి ఆయన్ను చూసుకుంటూ ఉండేవాడిని. మనసు బాగోకపోవడంతో కొన్నాళ్లు నటించలేదు. 2017లో నాన్న చనిపోయారు. అదే సమయంలో ఓ రియాలిటీ షోకు హోస్ట్‌గా చేసే అవకాశం వచ్చింది. దానితోపాటు దక్షిణాది చిత్రాల్లో నటించా. గ్యాప్ ఉండడంతో సెట్స్‌లో అంతా కొత్తగా అనిపించేది. అసౌకర్యంగా ఫీలయ్యేవాడిని'' అని పేర్కొన్నారు. సునీల్‌శెట్టి తెలుగులోనూ నటించిన సంగతి తెలిసిందే. మంచు విష్ణు 'మోసగాళ్లు', వరుణ్‌తేజ్ 'గని'లో కీలక పాత్రలు పోషించారు.

## రజనీకాంత్‌తో ప్రేమకథా చిత్రం
### : సుధా కొంగర

'గురు', 'ఆకాశం నీ హద్దురా' సినిమాలతో ప్రేక్షకులకు




మెప్పించిన దర్శకురాలు సుధా కొంగర. ఆమె దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'పరాశక్తి'. ప్రస్తుతం ఈ మూవీ ప్రమోషన్స్‌తో బిజీగా ఉన్నారు. ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. రజనీకాంత్‌తో ప్రేమకథా చిత్రాన్ని తెరకెక్కించాలన్నది తన డ్రీమ్ అన్నారు. ''నాకు లవ్‌స్టోరీలంటే చాలా ఇష్టం. పూర్తిస్థాయి ప్రేమకథను తెరకెక్కించాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. అది రజనీకాంత్ సర్ చేస్తే బాగుంటుంది. ఇప్పటికే నా వద్ద కథ ఉంది. దాన్ని డెవలప్ చేయాలి. నేను అలసిపోయా అందుకే త్వరగానే రిటైర్ కావాలనుకుంటున్నా'' అని పేర్కొన్నారు. పొలిటికల్ పీరియాడికల్ డ్రామాగా రూపొందిన 'పరాశక్తి'లో శివ కార్తికేయన్ హీరో. శ్రీలీల హీరోయిన్. రవి మోహన్, అథర్వ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా 2026 జనవరి 10న విడుదల కానుంది.

## ముగిసిన తెలుగు ఫిల్మ్‌ఛాంబర్ ఎన్నికల పోలింగ్

హైదరాబాద్: హైదరాబాద్: తెలుగు ఫిల్మ్‌ఛాంబర్ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఉదయం ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం ఒంటిగంట వరకూ కొనసాగింది. సాయంత్రం 6 గంటలకు ఎన్నికల ఫలితాలు వెల్లడికానున్నాయి. మన ప్యానల్ పేరిట చిన్న నిర్మాతలు, ప్రొగ్రెసివ్ ప్యానల్ పేరుతో పెద్ద నిర్మాతలు పోటీ పడుతున్నారు. తెలుగు ఫిల్మ్‌ఛాంబర్‌లో 3,355 మంది

## బ్లాక్ డ్రెస్‌లో మిల్కీ బ్యూటీ



మిల్కీ బ్యూటీ తమన్న గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. తన అద్భుతమైన నటన, అందంతో అభిమానులను ఆశ్చర్యపరుస్తోంది ఈ ముద్దుగుమ్మ. 2005లో తొలిసారి చాంద్ షా రోషన్ చెహ్రా అనే సినిమా ద్వారా బాలీవుడ్‌లో హీరోయిన్ గా తన కెరీర్ను ప్రారంభించింది. శ్రీ సినిమాతో తెలుగు, ఆ తర్వాత కేడి మూవీతో తమిళ్ సినీ ఇండస్ట్రీలోకి కూడా ప్రవేశించింది. టాలీవుడ్‌లో శ్రీ సినిమాతో పెద్దగా గుర్తింపు లభించలేదు. కానీ హ్యాపీడేస్‌మూవీతో ఊహించని పాపులారిటీ అందుకుంది. ఇందులో కాలేజ్‌స్టూడెంట్స్ గా తన పాత్రతో ఊహించని ఇమేజ్ సొంతం చేసుకుంది. ఆ తర్వాత వచ్చిన కొంచెం ఇష్టం కొంచెం కష్టం, 100% లవ్ , ఊసరవెల్లి, ఎందుకంటే ప్రేమంట, రెబల్, తడాఖా ఇలా ఎన్నో చిత్రాలలో నటించి సూపర్ సక్సెస్ అందుకుంది. ఇక నిత్యం సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటూ పలు రకాల ఫోటోలు షేర్ చేసే ఈమె తాజాగా ఫెమినా బి అన్ స్టాపబుల్ అనే మ్యాగజైన్ కవర్ పేజ్ కోసం స్పెషల్ గా ఫొటోషూట్ ఇచ్చింది. ఈ ఫోటోలలో బ్లాక్ అవుట్ ఫిట్ లో చాలా అందంగా కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచింది. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారుతుండగా.. అమ్మడి అందానికి అభిమానులు ఫిదా అవుతున్నారు.

## డార్లింగ్ ఇచ్చిన చీరతో..



ప్రభాస్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ ది రాజా సాబ్ ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతోంది. కామెడీ చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా హారర్-కామెడీ థ్రిల్లర్‌గా రూపొందుతోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రభాస్ కెరీర్‌లో తొలిసారి ఈ జానర్‌లో వస్తున్న సినిమా కావడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ సంక్రాంతి కానుకగా జనవరి 9న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. రిలీజ్‌కు సమయం దగ్గర పడటంతో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో హీరోయిన్ రిద్ధి కుమార్ చేసిన వ్యాఖ్యలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రభాస్‌తో కలిసి సినిమా చేయడం తనకు ఎంతో ఆనందమని, మూడు సంవత్సరాల క్రితం ఆయన బహుమతిగా ఇచ్చిన చీరను ఈ వేడుకకు ధరించి వచ్చానని ఆమె తెలిపింది. ఈ మాటలకు అభిమానులు ఉత్సాహంగా స్పందించారు. రిద్ధి వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



## మమ్మల్ని చూడండి



కన్నడ నటుడు సుదీప్ హీరోగా తెరకెక్కిన కొత్త సినిమా మార్క్. క్రిస్మస్ సందర్భంగా ఈ నెల 25న ఈ మూవీ విడుదలైంది. సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నటుడు సుదీప్ కన్నడేతర ఇండస్ట్రీలకు చెందిన నటుల గురించి కీలక వ్యాఖ్యలు చేశాడు. కన్నడ నటులు పర భాషా చిత్రాల్లో అతిథి పాత్రలు పోషిస్తుండగా.. ఇతర పరిశ్రమల వారు మాత్రం కన్నడ సినిమాల్లో అలాంటి రోల్స్ ప్లే చేసేందుకు ఆసక్తి చూపించడంలేదనేది సుదీప్‌ఆవేదన. ఈ విషయమై హీరోనే వ్యక్తిగతంగా కొందరు యాక్టర్లను కూడా అడిగాడట. కానీ వారి నుంచి సరైన స్పందన లేదట. 'శివ రాజ్‌కుమార్‌లాంటి సీనియర్ హీరో రజనీకాంత్ 'జైలర్' చిత్రంలో నటించాడు. బాలీవుడ్ హీరో సల్మాన్‌ఖాన్ విజ్ఞప్తి మేరకు 'దబాంగ్ 3'లో నేను నటించాను. అందుకోసం పారితోషికం కూడా తీసుకోలేదు. ఇక విజయ్ కోసం 'పులి' మూవీలో, స్క్రిప్టు బాగా నచ్చడంతో 'ఈగ'లో నటించాను' అని పేర్కొన్నాడు.



## సందడిగా 'ది రాజాసాబ్' ప్రీ రిలీజ్ ఈవెంట్

ప్రభాస్ హీరోగా దర్శకుడు మారుతి తెరకెక్కించిన సినిమా 'ది రాజాసాబ్'. ఈ మూవీ 2026 జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో శనివారం రాత్రి జరిగింది.





Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.